అనుదినం... జనస్వరం

ఉమ్మడి ఆదిలాబాద్


నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

విద్య ప్రత్యేక సంచిక

8 పేజీలు | మంగళవారం 27 జూన్ 2023 | www.navatelangana.com





- మన ఊరు- మనబడితో మారుతున్న రూపురేఖలు
- కొత్తగా ట్యాబ్‌లు.. నోటు పుస్తకాలతో విద్యార్థులకు మేలు
- నూతన ప్రవేశాలతోనూ కళకళలాడుతున్న బడులు

సర్కారు బడులు..సకల హంగులు..!

పేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే సర్కారు బడులకు మంచి రోజులు వస్తున్నాయి. ఈ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఇప్పటికే మన ఊరు- మన బడి కింద 30శాతం పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌళిక సదుపాయాలను కల్పిస్తున్న ప్రభుత్వం తాజాగా డిజిటల్ విద్యను అందించేందుకు టీవీలు, ట్యాబ్‌లు అందించి విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని తీసుకొచ్చింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పదివేలకు పైగా మంది విద్యార్థులు నూతనంగా ప్రవేశాలు తీసుకోవడం సర్కారు బడులకు శుభపరిణామంగా మారింది. బడిబాటలో భాగంగా విద్యాధికారులు, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా నూతన ప్రవేశాలు పెరగడం..ప్రయివేటులో ఫీజుల భారం కారణంగా అనేక మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారు. మౌళిక సదుపాయాలను సమకూర్చుతున్న ప్రభుత్వం.. సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కూడా నియమించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.










నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేద విద్యార్థులకు విద్యనందిస్తున్న సర్కారు బడులు అభివృద్ధి దిశగా పురోగమిస్తున్నాయి. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన మన ఊరు- మన బడి కార్యక్రమంతో మౌళిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి.ఉమ్మడి జిల్లాలో 3371 సర్కారు బడులు ఉండగా మన ఊరు - మన బడి కింద తొలి ఏడాదిలో ప్రతి ఏటా జిల్లాలో 30శాతం బడులను ఎంపిక చేస్తున్నారు. ఈ లెక్కన కిందటేడాది ఉమ్మడి జిల్లాలో 996 పాఠశాలలు ఈ పథకం కింద ఎంపికయ్యారు.ఇందులో ఇప్పటికే 200పైగా పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగితావి కొనసాగుతున్నాయి. 12 అంశాల్లో వీటిలో సదుపాయాలు కల్పిస్తున్నారు. నూతన తరగతి గదులు, విద్యుత్, తాగునీటి సదుపాయం, డ్యూయల్ డెస్కులు, ప్రహరీగోడలు, మరుగుదొడ్లు, గ్రీన్‌చాక్‌బోర్డులతో పాటు బడి ఆవరణను ఆహ్లాదకరంగా మారుసున్నారు. ఇప్పటికే పనులు పూర్తయిన పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. నిధుల లేమి, పర్యవేక్షణ లోపం కారణంగా మిగితా బడుల నిర్మాణాలు కొంత మందగిస్తున్నాయనే విమర్శలున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి ఈ పనులను వేగిరం చేయిస్తే తొలి విడతలో ఎంపికైనా బడులన్నింటిలోనూ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. తర్వాత రెండో విడత బడులను ఎంపిక చేసేందుకు వీలుంటుందని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి. రానున్న మూడేండ్లలో ఉమ్మడి జిల్లాలోని అన్ని బడుల్లోనూ పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా పనులు

మిగతా..4లో...



ట్యూషన్లు అవసరం లేకుండా విద్యా బోధన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రస్తుతం విద్యార్థులకు పాఠశాలలకు వెల్తున్నప్పటికీ ఫ్యాషన్‌గా మారిన ట్యూషన్‌కు పంపడం పరిపాటిగా మారుతున్న తరుణంలో ఆ అవసరం లేకుండా విద్యా బోధన కొనసాగిస్తున్నామని ప్రోగ్రెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ సాబీర్ అబూబకర్ అన్నారు. నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండి కంప్యూటర్‌పై ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీష్‌లో మాట్లాడే విధంగా తయారు చేస్తున్నామన్నారు. భాషపై పట్టుతో పాటు విషయ ప్రాధాన్యత గుర్తించేలా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాల ప్రారంభిస్తున్నప్పటికీ అన్ని వసతులు కల్పించామని తల్లిదండ్రులు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర విద్యాసంస్థలతో పోలిస్తే ఫీజులు తక్కువగా ఉన్నాయని వివరించారు.

సీఐగా జువ్వాజి సురేశ్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ సీఐగా జువ్వాజి సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో సీఐగా పనిచేస్తున్న సురేష్‌ను ఆసిఫాబాద్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన రాణాప్రతాప్‌ను స్థానిక ఎస్పి కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన ఇప్పటికే విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్సైలు రమేష్, గంగన్న, సందీప్, రాజేశ్వర్, సిబ్బంది నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న బీసీ వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు బీసీ వసతి గృహ సంక్షేమ అధికారి ఏ.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ప్రవేశం పొందే విద్యార్థులు కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలతో స్థానిక వసతి గృహంలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాల కొరకు 9652674367 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తెలంగాణ హెచ్ఆర్సీఐ మీడియా కార్యదర్శి ఎన్నిక




నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణా రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్ఆర్సీఐ) మీడియా కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన బాస్కరి రాజేశంను నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నందం నర్సింహారావు, రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్ రావులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర హెచ్ఆర్సీఐ ఆవిర్భావ సభలో నూతన కమిటిని నియమించారు. మిడియా కార్యదర్శిగా భాస్కరి రాజేశంకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతు తనపై నమ్మకంతో రాష్ట్ర మీడియా కార్యదర్శిగా నియమించిన హెచ్ఆర్సీఐ జాతీయ, రాష్ట్ర బాద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఆర్సీఐ ద్వారా మానవ హక్కుల రక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు పటిష్ట చర్యలు

- జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమాజంలో మంచి చెడు మార్పులకు విద్యా విధానంపై ఆదారపడి ఉంటుందని అటువంటి విద్యా వ్యవస్థను పకడ్బందీగా కొనసాగించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు జిల్లా విద్యా శాఖ అధికారి పార్సి అశోక్ అన్నారు. నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఒత్తిడి లను ఎదుర్కొంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ బడుల బలోపేతానికి తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు గుర్తించి వాటి పెంపుదల కోసం ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించామన్నారు తొలిమెట్టు నిర్వహణ కోసం క్లస్టర్ స్థాయి మండలాధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉత్సాహం కలిగించే ఉద్దేశంతో పాఠశాలల్లో మౌలిక వసతులు పెంపొందించడానికి మన ఊరు-మన బడి ద్వారా 251 పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగున్నాయని తెలిపారు. దీనిలో ఇప్పటికే 35 పాఠశాలలు పనులు పూర్తిచేసుకుని ప్రారంభమయ్యాయని వివరించారు. జిల్లావ్యాప్తంగా 152 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు 250 పుస్తకాల చొప్పున లైబ్రరీ ఏర్పాటు చేశామన్నారు. రూమ్ టు రీడ్ కార్యక్రమం ద్వారా ప్రతి కాంప్లెక్స్ కు 400 నుండి 700 పుస్తకాలను జిల్లా వ్యాప్తంగా 65 కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేశామని ఒకటి నుండి ఏడవ తరగతి వరకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం 37 పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ద్వారా డిజిటల్ టీవీలతో బోధన కొనసాగుతుందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు రాగిజావ అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆంగ్ల మాధ్యమాన్ని 9వ తరగతికి విస్తరించినట్లు వివరించారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 72,000 మంది విద్యార్థులకు వర్క్ బుక్కులు నోటుబుక్కులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్య అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సమాజాన్ని కూడా పాఠశాలలో భాగస్వామ్యం చేయాలని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడానికి నిర్ణయించామని, దీనిలో భాగంగా ప్రతి నెలలో మూడవ శనివారం సమావేశం కోసం కేటాయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సమయసారిని పాటించడంతోపాటు పీరియడ్ పథకాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే విద్యార్థులైన, ఉపాధ్యాయులైన తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఇంటర్, డిగ్రీలో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులకు సేవ చేయడమే లక్ష్యంగా విద్యాసంస్థను స్థాపించి దాని అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మాతృశ్రీ జూనియర్, డిగ్రీ కళాశాలల డైరెక్టర్, ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. ఆయన నవతెలంగాణో మాట్లాడుతూ 2014లో 186 మందితో కళాశాల ప్రారంభించామని తెలిపారు. అప్పటినుండి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మాతశ్రీ కళాశాలలో మొదటి బ్యాచ్‌లో విద్యను అభ్యసించిన సమ్రీన్, శ్వేత ఫిజియోథెరపీ పూర్తిచేసే ప్రాక్టీస్ చేస్తున్నారని, నయాల తాలత్ ఆక్యుపంచరీ వైద్య నిపుణురాలుగా పనిచేస్తున్నారని ఇది తమ విజయమేనన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 971 మార్కులతో జిల్లాలో ఉత్తమ స్థానం సంపాదించామని డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సంపాదించినట్లు తెలిపారు. ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 13888 అగ్రికల్చర్ విభాగంలో 24,525 తమ విద్యార్థులు ర్యాంకు సాధించారని తెలిపారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన విద్యను అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేట్ విద్యను కొమరం భీం జిల్లాలో అందిస్తున్నామని ఇది గర్వంగా ఉందని తెలిపారు.

అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా విద్యా బోధన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మిసైల్ మ్యాన్ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగిస్తూ ఆయన పేరు మీద జిల్లా కేంద్రంలో పాఠశాల నడుపుతున్న పాఠశాల డైరెక్టర్ అబ్దుల్ హసన్ అన్నారు. ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ దేశ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు అబ్దుల్ కలాం ఎన్నో ఉత్తమమైన విషయాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అటువంటి ఉత్తమ వ్యక్తి పేరు పెట్టుకుని పాఠశాలను కొనసాగిస్తున్నామని సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. విద్యార్థులు అభివృద్ధి కోసం ప్రత్యేక స్టడీ అవర్స్ పెట్టడంతో పాటు చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి కేటాయిస్తున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉండడంతో పాటు విశాలమైన క్రీడ మైదానం కలిగి ఉందని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని తెలిపారు. తాము పడుతున్న శ్రమకు గతంలో వచ్చిన ఫలితాలు సాక్ష్యం అన్నారు. వెనుకబడిన జిల్లాలో అత్యుత్తమ విద్యను అందించాలని లక్ష్యంతో గొప్ప వ్యక్తి పేరు మీదుగా పాఠశాల నడుపుతున్నట్టు వివరించారు. పదవ తరగతి వరకు విశాలమైన తరగతి గదులు ఉన్నాయని అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థులు తల్లిదండ్రులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదానందం డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న డీఆర్ లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా గుర్తింపు పొందిన అన్ని ఆస్పత్రులలో వైద్యం చేయాలన్నారు. ప్రభుత్వ సలహా మండలిలో పెన్షనర్లకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జులై 1 2023న ఇచ్చే కొత్త పీఆర్సీ అమలు చేయాలన్నారు. 70 సంవత్సరాల అదనపు క్వాంటంను 65 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. కమ్యూటేషన్ 15 సంవత్సరాల నుండి 12 సంవత్సరాల తగ్గించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెల మొదటి రోజున పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనిట్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రామ్మోహన్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామస్వామి, యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, మధుసూధన్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గుర్రాల వేంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్ ఆలం, అమలమేరి, జిల్లా కోశాధికారి కె.లింగయ్య, యూనిట్ ఉపాధ్యక్షులు మహ్మద్ షిరాజ్ ఉల్ హక్, కోశాధికారి పి.కిష్టయ్య, సుభాష్ సింగ్, నాగయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

జన్నారం : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల నాయకులు సోమవారం తహసీల్దార్ ఐ.కిషన్‌కు వినతి పత్రం అందజేశారు. తమకు ఇచ్చే పెన్షన్ సకాలంలో చెల్లించాలని, అన్ని సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు అడ్డగోరి భూమన్న, ప్రధాన కార్యదర్శి కస్తూరి నాగేశ్వరరావు, కోశాధికారి కూకటికారి బుచ్చయ్య, సంఘ నాయకులు దేవన్న లచ్చయ్య, రాజయ్య పాల్గొన్నారు.

ఇంటర్ తర్వాత.. ఎన్నెన్నో అవకాశాలు

గ్రూప్ ఏదైనా పక్కాగా ప్లానింగ్ చేసుకోవాలి.. అప్పుడే సరైన గమ్యం దిశగా అడుగులు పడతాయి. ఇంటర్మీడియెట్ పరీక్షలు మరో నాలుగు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో ఆయా గ్రూప్‌ల వారీగా విద్యార్థులకు అందుబాటులోఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ఫోకస్...

ఎంపీసీ.. ఇంజనీరింగ్‌తోపాటు ఎన్నెన్నో అవకాశాలు

ఎంపీసీ.. ఇంటర్మీడియెట్‌లో అత్యధికులు ఎంచుకునే గ్రూప్. ఇంటర్ ఎంపీసీ పూర్తయ్యాక ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో కోర్సుల్లో చేరొచ్చు. ఈ గ్రూప్‌తో అందుబాటులో ఉన్న కోర్సులు, ఉద్యోగావకాశాలు..

నవతెలంగాణ- ఆదిలాబాద్



ఇంజనీరింగ్: ఎంపీసీ విద్యార్థుల్లో 90 శాతం మంది లక్ష్యం ఇంజనీరింగ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుతం మన దేశంలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి ఐఐటలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, యూనివర్సిటీల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలు ప్రవేశాలు కల్పిస్తున్నాయి. అందుకోసం ప్రతి ఏటా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎంట్రెన్సలు నిర్వహిస్తారు.

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలకు జేఈఈ: దేశంలోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీలు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్. ఇది మెయిన్, అడ్వాన్స్‌డ్ అనే రెండు దశలుగా ఉంటుంది. మెయిన్‌లో ఉత్తీర్ణులకు ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశ కౌన్సెలింగ్‌కు అర్హత లభిస్తుంది. మెయిన్ మార్కులు, ఇంటర్మీడియెట్ మార్కుల పర్సంటైల్ ప్రాతిపదికన నిర్వహించే అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా ఐఐటీల్లో ప్రవేశానికి మార్గం సుగమం చేసుకోవచ్చు.

ఎంసెట్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఎంసెట్. ప్రతి ఏటా మేలో ఈ పరీక్ష జరుగుతుంది. ఎంసెట్ ర్యాంకు ద్వారా రెండు రాష్ట్రాల్లోని 700కు పైగా కళాశాలల్లో అడ్మిషన్ కల్పిస్తారు. మూడు లక్షలకుపైగా ఇంజనీరింగ్ సీట్లకు కౌన్సెలింగ్ జరుగుతుంది. బిట్‌శాట్: దీని ద్వారా ప్రముఖ బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఇంజనీరింగ్ కోర్సుల్లో అడుగుపెట్టొచ్చు. అలాగే వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు ప్రవేశ పరీక్షల ద్వారా అడ్మిషన్‌లు కల్పిస్తున్నాయి.

బీఎస్సీ: ఎంపీసీ ఉత్తీర్ణులకు సంప్రదాయ డిగ్రీ కోర్సుగా పేరు గడించింది బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్సీ). ఇప్పుడు బీఎస్సీ కోర్సులోనూ కొత్త స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, స్టాటిస్టిక్స్ వంటి మల్టీడిసిప్లినరీ స్పెషలైజేషన్స్‌ను యూనివర్సిటీలు ప్రవేశపెడుతున్నాయి. దాంతో బీఎస్సీని చక్కటి ఉన్నత విద్యా మార్గంగా ఎంచుకోవచ్చు.

ఉద్యోగావకాశాలు: ఎంపీసీ అర్హతగా ఎన్నో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఎగ్జామినేషన్, స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటీస్ ఎగ్జామినేషన్ (ఎస్‌సీఆర్‌ఏ).

ఎన్‌డీఏ: ఇండియన్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవల్ అకాడమీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష నేషనల్ డిఫెన్స అకాడమీ ఎగ్జామినేషన్. ఈ పరీక్షలో ఉత్తీర్ణత ఆధారంగా అభ్యర్థులు ఎంచుకున్న విభాగం ఆధారంగా ఆయా అకాడమీల్లో శిక్షణ ఉంటుంది. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బీఎస్సీ/బీఏ డిగ్రీబీ నేవల్ అకాడమీలో శిక్షణ పొందిన వారికి బీటెక్ డిగ్రీతోపాటు పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో త్రివిధ దళాల్లో కెరీర్ ప్రారంభమవుతుంది.

ఎస్‌సీఆర్‌ఏ: ఇండియన్ రైల్వేస్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్ష స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటీస్ ఎగ్జామినేషన్. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఉచితంగా బీటెక్ డిగ్రీతోపాటు రైల్వేలో కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతమవుతుంది.

టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌తోనూ డిఫెన్స్‌లో ఎంట్రీ: త్రివిధ దళాల్లో ఉన్నత విద్య, ఉద్యోగాలపరంగా లభించే మరో అవకాశం ఇండియన్ ఆర్మీ నిర్వహించే 10ం2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్. అకడమిక్ మెరిట్ ఆధారంగా నిర్వహించే ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుంది. తర్వాత శిక్షణ లభిస్తుంది. దీన్ని పూర్తి చేసుకుంటే.. బీటెక్ డిగ్రీతోపాటు పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కెరీర్ ప్రారంభించొచ్చు.

బహుళ అవకాశాల బైపీసీ

ఇంటర్మీడియెట్ స్థాయిలో విద్యార్థులకు మరో క్రేజీ గ్రూప్ బైపీసీ. డాక్టర్ కల నెరవేర్చుకునేందుకు ఎంబీబీఎస్‌లో చేరే అవకాశం ఉండటమే అందుకు కారణం. కానీ పరిమిత సీట్ల సంఖ్య కారణంగా ప్రతిభ ఉన్నప్పటికీ ఆ అవకాశాన్ని అందుకోలేని విద్యార్థులు ఎందరో! అలాంటి వారికి మెడికల్‌కు దీటుగా కెరీర్ అవకాశాలను కల్పించే మరెన్నో ప్రత్యామ్నాయ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిపై అవగాహన పొంది తమకు తగిన కోర్సును ఎంచుకుంటే అద్భుత కెరీర్ సొంతమవుతుంది.

ఫార్మసీ కోర్సులు: బైపీసీ ఉత్తీర్ణులకు తమ కోర్ విభాగంలో మంచి భవిష్యత్తును అందించే కోర్సులు.. ఫార్మసీ. ప్రస్తుతం బీఫార్మసీ, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ(ఫార్మా-డీ), డిప్లొమా ఇన్ ఫార్మసీ అనే మూడు స్థాయిల కోర్సులకు బైపీసీ విద్యార్థులు అర్హులు. బీఫార్మసీ, ఫార్మా-డీకి ఎంసెట్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం లభిస్తుంది. ఇవి పూర్తి చేసుకున్న వారికి కోర్సు స్థాయి ఆధారంగా ఫార్మసీలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, క్లినికల్ రీసెర్చ్ కంపెనీల్లో ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలు లభిస్తాయి.

మరెన్నో ప్రత్యామ్నాయాలు: బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స‌ అండ్ యానిమల్ హస్బెండ్రీ, డైరీ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్ వంటి మరెన్నో కోర్సులు కూడా ఉన్నాయి. వీటితోపాటు బ్యాచిలర్స్ డిగ్రీ స్థాయిలో బీజడ్‌సీతోపాటు బయోకెమిస్ట్రీ, బయో ఫిజిక్స్, బయో ఇన్ఫర్మాటిక్స్, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, జెనెటిక్స్ తదితర లైఫ్ సైన్సెస్ కోర్సులు కూడా చక్కటి కెరీర్ మార్గాలుగా నిలుస్తున్నాయి. వీటిని పూర్తి చేస్తే ప్రతిభ ఆధారంగా మంచి కెరీర్ అందుకోవచ్చు.

మెడికల్ రంగంలోనే: బైపీసీ విద్యార్థుల లక్ష్యం మెడికల్ రంగంలో అడుగు పెట్టడం. అందుకోసం ఎంబీబీఎస్, బీడీఎస్, బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతి, బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ సైన్సెస్‌లు మొదటి వరుసలో ఉంటున్నాయి. ఇవి అందుకోలేనివారికి, మెడికల్ రంగంలోనే కెరీర్ కోరుకునే వారికి సైతం ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి..

పారా మెడికల్ కోర్సులు: ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఆప్టోమెట్రీ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ వంటివి. వీటిని పూర్తి చేసుకున్నవారికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.

నర్సింగ్: రోగులతో నేరుగా సంప్రదిస్తూ సేవలందించే విధంగా తోడ్పడే కోర్సు.. నర్సింగ్. ప్రస్తుతం బైపీసీ ఉత్తీర్ణులకు డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ స్థాయిల్లో నర్సింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన మహిళా అభ్యర్థులకు ఇండియన్ ఆర్మీ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సులో ప్రవేశం కల్పిస్తుంది. దీని ద్వారా నాలుగేళ్లపాటు శిక్షణనిచ్చి బీఎస్సీ నర్సింగ్ సర్టిఫికెట్‌తోపాటు ఇండియన్ ఆర్మీకి చెందిన హాస్పిటల్స్‌లో పర్మనెంట్ హోదాలో ఉద్యోగం ఖరారు చేస్తుంది.

జాబ్స్: ఇంటర్ అర్హతగా నిర్వహించే పలు ఉద్యోగ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

కాంపిటీషన్‌లో కలిసొచ్చే హెచ్ఈసీ

హెచ్ఈసీ విద్యార్థులు సాధారణంగా డిగ్రీ స్థాయిలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్సను ఎంచుకుంటారు. హెచ్ఈసీ ఫౌండేషన్‌తో భవిష్యత్తులో పలు కాంపిటీటివ్ పోటీ పరీక్షల్లో ముందుండేందుకు ఎంతో ఆస్కారం లభిస్తుంది. అత్యున్నత సివిల్ సర్వీసెస్ నుంచి వీఆర్వో/వీఆర్ఏ వరకూ అన్ని పోటీ పరీక్షల్లోనూ హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర సబ్జెక్ట్‌ల ప్రశ్నలు తప్పనిసరిగా ఉండటం.. వాటిని ఇంటర్మీడియెట్, బీఏ స్థాయిలో అధ్యయనం చేసి ఉండటంతో హెచ్ఈసీ విద్యార్థులు పోటీలో ముందంజలో నిలుస్తారు.

ప్రొఫెషనల్‌గా రూపుదిద్దుకుంటున్న బీఏ: హెచ్ఈసీ విద్యార్థులు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే బీఏ కోర్సు.. గ్రూప్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్ల విషయంలోనూ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ప్రొఫెషనల్ రూపు సంతరించుకుంటోంది. ఈ క్రమంలో బీఏ స్థాయిలోనే కమ్యూనికేషన్స్ అండ్ పబ్లిక్ రిలేషన్స్, మార్కెటింగ్, అడ్వర్టయిజింగ్ వంటి స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి.

'లా' కోర్సులతో కెరీర్ కళ: ఇంటర్మీడియెట్ హెచ్ఈసీ విద్యార్థులకు సంప్రదాయ బీఏ కోర్సుకు ప్రత్యామ్నాయంగా నేటి పోటీ ప్రపంచంలో చక్కటి కెరీర్ అవకాశాలు అందించే మార్గంగా నిలుస్తున్న కోర్సు బీఏ-ఎల్ఎల్‌బీ. ఇంటర్మీడియెట్ అర్హతతో ఐదేళ్ల లా కోర్సులో అడుగుపెట్టొచ్చు. ఈ 'లా' కోర్సులోనూ కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా కొత్త సబ్జెక్ట్‌లు (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, కార్పొరేట్ లా తదితర) మేజర్లుగా అందుబాటులో ఉంటున్నాయి. దీంతో లా పూర్తి చేసిన అభ్యర్థులు కేవలం న్యాయవాద వత్తికే పరిమితం కాకుండా కార్పొరేట్ కొలువులు సొంతం చేసుకోవడానికి అవకాశం లభిస్తోంది.

సీఈసీ.. కార్పొరేట్ కొలువులకు మార్గం

ప్రస్తుత కార్పొరేట్ యుగంలో బహుళ జాతి సంస్థల్లో వైట్ కాలర్ ఉద్యోగాలకు మార్గం సీఈసీ. దీని అర్హతగా అటు బ్యాచిలర్స డిగ్రీతోపాటు సీఏ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులను పూర్తిచేయొచ్చు. తద్వారా కార్పొరేట్ కొలువులు సొంతం చేసుకోవచ్చు. సీఈసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న కోర్సులు..

బీకాం: సాధారణంగా సీఈసీ విద్యార్థుల్లో అధిక శాతం మందికి మొదటి ఆప్షన్ బీకాం (బ్యాచిలర్ ఆఫ్ కామర్స్). ఇప్పుడు బీకాం కోర్సు సైతం ఆధునికత సంతరించుకుంది. సంప్రదాయ కామర్స్, అకౌంటింగ్ స్పెషలైజేషన్లతోపాటు పోటీ ప్రపంచానికి, పరిశ్రమ అవసరాలకు సరితూగేలా బీకాం స్థాయిలోనే ఈ-కామర్స్, టాక్స్ ప్రొసీజర్స్ అండ్ ప్రాక్టీస్, అడ్వర్టయిజింగ్ అండ్ మార్కెటింగ్ వంటి విభిన్న స్పెషలైజేషన్స్ అందుబాటులోకి వస్తున్నాయి.

ప్రొఫెషనల్ కోర్సులు: చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ.. సీఈసీ విద్యార్థులకు అనుకూలించే మూడు ముఖ్యమైన ప్రొఫెషనల్ కోర్సులు. వీటి లో తమకు సరితూగే కోర్సును పూర్తిచేయడం ద్వారా ఉజ్వల కెరీర్‌కు మార్గం వేసుకోవచ్చు. ఎంబీఏలకు దీటుగా జీతభత్యాలు అందుకోవచ్చు. రెగ్యులర్‌గా డిగ్రీ చదువుతూనే ఈ ప్రొఫెషనల్ కోర్సులను పూర్తిచేసుకోవచ్చు. దీనివల్ల విద్యార్థులకు సమయం వథా కాదు. ఏకకాలంలో అటు డిగ్రీ కోర్సు, మరోవైపు జాబ్ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న చక్కటి ప్రొఫెషనల్ కోర్సు సర్టిఫికెట్ చేతికందుతుంది.

ఉద్యోగావకాశాలు:

సీఈసీ విద్యార్థులు అకౌంటింగ్‌లో స్వల్పకాలిక సాఫ్ట్‌వేర్ ప్యాకేజ్ కోర్సులు(ట్యాలీ, వింగ్స్, ఫోకస్ తదితర) పూర్తి చేస్తే కంపెనీల్లో అకౌంటెంట్ ఉద్యోగాలు అందుకోవచ్చు.

ఎనీ గ్రూప్.. ఉద్యోగ పరీక్షలు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్: కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని డేటా ఎంట్రీ ఆపరేటర్, లోయర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే పరీక్ష ఇది. ఇంటర్మీడియెట్ అర్హతతోపాటు డేటా ఎంట్రీ, కంప్యూటర్ టైపింగ్‌లో అనుభవం ఉంటే ఈ పరీక్షలో సులువుగా రాణించొచ్చు.

పోస్టల్ అసిస్టెంట్స్, సార్టింగ్ అసిస్టెంట్స్: తపాలా శాఖలో ఆయా రాష్ట్రాల స్థాయిలోనే నియామకాలు చేపట్టే ఉద్యోగాలు పోస్టల్ అసిస్టెంట్స్, సార్టింగ్ అసిస్టెంట్స్. వీటికోసం రాత పరీక్ష, కంప్యూటర్/టైపింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చాల్సి ఉంటుంది.

పోలీస్ శాఖలో కానిస్టేబుల్:

పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగానికి కూడా ఇంటర్మీడియెట్ కనీస అర్హత. దీంతోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, రాత పరీక్షలో ఉత్తీర్ణత ఆధారంగా కొలువు సొంతం చేసుకోవచ్చు.

పారా మిలిటరీ: జాతీయ స్థాయిలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఇండో-టిబెటిన్ బోర్డర్ ఫోర్స్ తదితర పారా మిలిటరీ విభాగాల్లోనూ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్ అర్హతగా దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రూప్-4 ఉద్యోగాలు:

రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాల భర్తీకి చేపట్టే గ్రూప్-4 నియామక పరీక్షలకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోనే పోటీ పడొచ్చు. అదే విధంగా రెవెన్యూ శాఖ పరిధిలో వీఆర్ఓ (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్) పోస్టులకు కూడా అర్హులే.

ఉన్నత విద్య మార్గాలు:

గ్రూప్‌తో సంబంధం లేకుండా ఇంటర్మీడియెట్ విద్యార్థులందరూ డీఈడీ(డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్)లో చేరొచ్చు. ఉపాధ్యాయ వత్తిలో స్థిరపడేందుకు దోహదం చేసే కోర్సు ఇది. డైట్ సెట్‌లో ర్యాంకు ఆధారంగా ఈ కోర్సు పూర్తి చేసుకుంటే డీఎస్సీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌జీటీ ఉద్యోగాలకు అర్హత లభిస్తుంది.

పర్యాటకం, ఆతిథ్యం:

ఇటీవల కాలంలో విస్త తంగా వద్ధి చెందుతున్న రంగంగా పేరు పొందిన టూరిజం అండ్ హాస్పిటాలిటీకి సంబంధించి ప్రస్తుతం పలు కోర్సులు బ్యాచిలర్స్ డిగ్రీ స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. వీటికి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

సకల సదుపాయాలు.. మెరుగైన విద్య

- బడిబాటతో భారీగా నూతన ప్రవేశాలు
- ఈ ఏడాది డిజిటల్ విద్య బలోపేతం
- నవతెలంగాణతో డీఈఓ ప్రణీత

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని.. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీత అన్నారు. బడిబాట కార్యక్రమంతో ఈ ఏడాది విద్యార్థులు భారీగా ప్రవేశాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది సర్కారు బడుల్లో డిజిటల్ విద్యను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 56ఉన్నతపాఠశాలలకు ఐఎఫ్‌పీ ప్యానెల్‌లు అందించామని.. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ట్యాబ్‌లు అందించినట్లు వివరించారు. జిల్లా విద్యావ్యవస్థ బాగుకు చేపడుతున్న చర్యలను నవతెలంగాణకు వివరించారు.

ఈ ఏడాది కొత్తగా ట్యాబ్‌లు అందించాం

జిల్లాలోని 436 ప్రాథమిక పాఠశాలలకు 450 ట్యాబ్‌లు అందించామని, 105 ప్రాథమికోన్నత పాఠశాలలకు 115 ట్యాబ్‌లు అందించినట్టు చెప్పారు. వీటితో పాటు పాఠశాల విద్యార్థులు, టీచర్లు, మధ్యాహ్న భోజనం తదితర అన్ని వివరాలు ఇందులో పొందుపర్చే అవకాశం ఉంటుంది. పాఠ్య పుస్తకాలతో పాటు ఈ ఏడాది కొత్తగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఇప్పటికే జిల్లాలో 137 పాఠశాలల్లో మన ఊరు- మనబడి కింద పనులు జరుగుతుండగా ఇప్పటికే 80 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఇందులో 12రకాల సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. మిగితా పాఠశాలల్లోనూ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత నాణ్యమైన విద్యాబోధన జరిగేలా ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.

ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించామని కొత్తగా 5వేల మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారని తెలిపారు. బడుల్లో మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు విద్యాశాఖ, ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేస్తారని చెప్పారు. టీచర్లు లేని బడుల్లోనూ నియమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామన్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పున ప్రారంభమవుతున్న దృష్ట్యా బడుల్లో సౌకర్యాలు..2023-24 విద్యా సంవత్సరంలో తీసుకుంటున్న చర్యలపై నవతెలంగాణకు వివరించారు. ఆమె మాటల్లోనే వివరాలు ఇవి

పాఠ్యపుస్తకాలు..దుస్తులు వచ్చాయి

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 678 పాఠశాలలు ఉండగా సుమారు 70వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి గాను సుమారు 5.70లక్షల పుస్తకాలు అవసరమవుతాయి. ఇప్పటి వరకు జిల్లాకు 5.21లక్షల పుస్తకాలు వచ్చాయి. మిగిలిన 49వేల పుస్తకాలు రావాల్సి ఉంది. ఇప్పటికే చేరిన పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా పాఠశాలలకు పంపిస్తాం. ముఖ్యంగా విద్యార్థులకు అందించే సమరూప దుస్తులు కూడా వచ్చాయి. కుట్టుకోసం దర్జీలకు అప్పగించాం. 80శాతం కుట్టడం ఆయిపోయింది.ఈ నెల 28వతేదీన పాఠశాలల్లో విద్యార్థులకు అందించాలని ఇది వరకే ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. అసలే ఉపాధ్యాయులు లేని పాఠశాలలు అతి తక్కువగా ఉన్నాయి. సోమవారం నుంచి ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓలకు సూచించాం.

మన బడి పనులు పూర్తవుతున్నాయి

సర్కారు బడుల్లో మౌళిక సదుపాయాల కోసం ప్రభుత్వం మన ఊరు- మనబడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో తొలి విడత కింద 237 పాఠశాలలను ఎంపిక చేసింది. ఇప్పటికే సుమారు 130పాఠశాలల్లో 12 అంశాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాం. ఇప్పటికే అనేక పాఠశాలలను ప్రారంభించాం. మిగితా వాటిలో కూడా పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించిన బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులను సర్కారు బడుల్లో చేర్పిస్తున్నారు. ఇప్పటి వరకు 5వేల మంది విద్యార్థులు కొత్తగా బడుల్లో చేరారు. మరికొన్ని రోజుల్లో ఇంకా అనేక మంది చేరేందుకు అవకాశం ఉంది. సర్కారు బడుల్లో బోధనలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉండటం.. ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడం మూలంగా అనేక మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పున ప్రారంభం అవుతున్న దృష్ట్యా ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేక శు భాకాంక్షలు చెబుతున్నానని వివరించారు.

సర్కారు బడులు..సకల హంగులు..!

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో సర్కారు బడుల్లో ఆధునాతన హంగులు అందుబాటులోకి వస్తాయి.

ట్యాబ్‌లు, నోటు పుస్తకాలతో ప్రయోజనం

జిల్లాలో ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన కొనసాగుతోంది. మిగితా ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లోనూ ఈ విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా కనీసం 10 మంది విద్యార్థులు ఉన్నచోట ఒక ట్యాబ్, 165 మంది కంటే ఎక్కువ ఉన్న చోట్ల రెండు చొప్పున ట్యాబ్‌లను అందించారు. ఆదిలాబాద్ జిల్లాలో 436 ప్రాథమిక పాఠశాలలకు 450ట్యాబ్‌లు అందించగా, 105 ప్రాథమికోన్నత పాఠశాలలకు 115 ట్యాబ్‌లను అందించారు. వీటితో పాటు ఈ





ఏడాది కొత్తగా విద్యార్థులకు నోటు పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోంది. సర్కారు బడుల్లో చదివేది ఎక్కువగా పేద విద్యార్థులే కావడం.. నోటు పుస్తకాలు కొనుగోలు చేసేందుకు ఆర్థిక భారం పడనుండటంతో ప్రభుత్వమే ఉచితంగా అందించే ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్‌లను అందించారు. గతంలో కంటే సౌకర్యాల పరంగా సర్కారు బడుల్లో కొంత మెరుగైన పరిస్థితులు కనిపించడం సానుకూలంగా మారుతోంది. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను కూడా భర్తీ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన బోధన లభించేందుకు ఆస్కారం ఉంటుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటే ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల కంటే ధీటైన బోధన అందించే వెసులుబాటు ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికే విద్యార్థులకు సమరూప దుస్తులు అందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- ఈ ఏడాది నుంచి విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్
- జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్‌కుమార్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని జిల్లా మాధ్యమిక విద్యాధికారి సి.రవీందర్‌కుమార్ అన్నారు. కళాశాలల్లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని ..అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతోందని తెలిపారు. కిందటేడాది ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు 90మందికి ఎంసెట్‌లో శిక్షణ ఇవ్వగా.. ఇందులో 60మంది విద్యార్థులు మంచి ర్యాంకు సాధించారు. ఈ ఏడాది ఎస్సీ,ఎస్టీ విద్యార్థులతో పాటు కళాశాలల్లో ప్రతిభ కనబర్చిన మిగితా విద్యార్థులకూ ఏడాది పొడవునా ఎంసెట్‌పై శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాం. ఇది వరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో ఈ ఏడాది మరింత అధికంగా ప్రవేశాలు పెంచేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు.జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థపై నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు.

మెరుగైన విద్యనందిస్తున్నాం

ఆదిలాబాద్ జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా సుమారు 3వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో ఇప్పటికే 2012 మంది నూతనంగా ప్రవేశాలు తీసుకున్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. మరికొంత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంటుంది. కళాశాలల్లో నాణ్యమైన బోధన తీరు,



సౌకర్యాలు,ఇటీవల సాధించిన ఫలితాలపై ప్రచారం చేయడం మూలంగా విద్యార్థులు సర్కారు కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో అన్ని కళాశాలల్లో సరిపడా భవనాలు, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం 130మంది రెగ్యూలర్ అధ్యాపకులు ఉండగా అతిథి అధ్యాపకుల నియామకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తరగతి గదుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇటీవలే ఇక్కడ తాగునీటి సమస్య కూడా పరిష్కారమైంది. జైనథ్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు విషయమై ఇది వరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అక్కడ్నుంచి అనుమతి రావాల్సి ఉంది.

ఈ ఏడాది ఎంసెట్‌లో కోచింగ్

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎంసెట్‌లో ప్రతిభ కనబర్చాలనే ఉద్దేశంతో కిందటేడాది నుంచి ఎంసెట్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. ఇది వరకు ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు 90మందికి శిక్షణ ఇవ్వగా ఇందులో 60మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఈ ఏడాది నుంచి వీరితో పాటు ఆయా కళాశాలల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు కూడా ఏడాది పొడవునా కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించాం. ముందుగా ఒక్కో కళాశాల నుంచి కొందరు విద్యార్థుల చొప్పున పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన వారికి ఈ శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాం. ఇందుకు ఉన్నతాధికారులు కూడా సానుకూలంగా ఉన్నారు. రెగ్యూలర్ తరగతులతో పాటు ఈ కోచింగ్‌ను కూడా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తాం. ఉన్నతాధికారులు, అధ్యాపకుల తోడ్పాటుతో ప్రభుత్వ ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేస్తామని వివరించారు.


కాంగ్రెస్‌లో భారీ చేరికలు


నవతెలంగాణ-బోథ్

మండలంలోని గుట్టపక్క తండా గ్రామంలోని సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడాల శేఖర్ అధ్వర్యంలో దాదావు 40 మంది బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కర్ణాటకలో, రాజస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి చాలా బాగా ఉందని, ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్నారు. తెలంగాణలో కూడా రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు ప్రఫుల్‌రెడ్డి, మండల అధ్యక్షులు కురుమేలి మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్, ప్రధాన కార్యదర్శి రాజురెడ్డి, గంగారెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, విజయ భాస్కర్, సంతోష్‌రెడ్డి, తులసిరామ్ పాల్గొన్నారు.









సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఆసిఫాబాద్ : ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున అన్ని ఏర్పాలతో సిద్ధంగా ఉండాలని, ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనం, జిల్లా పోలీసు కార్యాలయ భవనాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయి, ఎస్పీ సురేష్‌కుమార్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఖరారు అయినందున కార్యక్రమం సంబంధిత ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రక్షణ, భోజన వసతి, ట్రాఫిక్, తాగునీరు తదితర పూర్తిస్థాయి ఏర్పాట్లతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పర్యటనను విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. అంతకుముందు వడ్డెపెల్లి గార్డెన్‌లో పార్టీ ప్రతినిధులతో పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నగేష్, ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రాథోడ్ జనార్ధన్, ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ, జడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కాసం శ్రీనివాస్, మల్లేష్, మాజీ డిసిసిబి చైర్మన్ రామ్‌కిషన్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు జగ్గాగౌడ్, అన్ని మండలాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.















కృష్ణవేణి పాఠశాలలో ఐఐటి సిలబస్

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో పదో తరగతిలో 10/10 ఇద్దరు విద్యార్థులు, 9.8 ముగ్గురు విద్యార్థులు, 9.7 ఆరుగురు విద్యార్థులు, 100 శాతం ఉత్తీర్ణత సాధించి, ప్రభంజనం సృష్టించారు. నూతనంగా కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రథమంగా ఐఐటీ సిలబస్ ప్రారంభించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేకంగా ఐఐటీ సిలబస్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి లక్షల్లో ఫీజులు కట్టి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ కోర్సును ప్రారంభించారు. ఖానాపూర్‌లో ఎందరో మంది ప్రతిభ గల విద్యార్థులు ఉన్నారని వారి కోసం ప్రత్యేకంగా ఐఐటీని తమ పాఠశాలలోనే తక్కువ ఫీజుతో బోధిస్తున్నట్టు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-తాంసి

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు భజరంగ్, నాయబ్ తహసీల్దార్ విష్ణు జాదవ్‌కు విశ్రాంత ఉద్యోగులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెండు డీఆర్‌లు చెల్లించాలని అన్నారు. ప్రతీ నెల ఒకటవ తేదీన పెన్షన్లు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ పెన్షనర్ల కనిష్ట పెన్షన్‌ను రూ.30వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిలుక దేవిదాస్, నారాయణరెడ్డి, రాజన్న, కిష్టారెడ్డి ఉన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి : బీజేపీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని దనోర(బి)లో ఇటీవల జరిగిన ఆదివాసీ మహిళపై లైంగిక దాడి చేసి, హత్యచేసిన హంతకులకు కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సీడం భీమ్‌రావ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం హత్యకు గురైన మహిళ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేశారు. నిందితులు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని అన్నారు. అవసరమైతే వారికి ఉరి శిక్ష వేయాలని అన్నారు. ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మరప్ప రాజు, రాథోడ్ భీమ్ రావ్, చరక్ సుధీర్, ఆరెల్లి రాజ లింగు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో సోమవారం కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తెలిపారు. కిచెన్ గార్డెన్‌లో కూరగాయల మొక్కలు నాటి ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యత గల, కల్తీ లేని కూరగాయలు ఇవ్వటానికి గాను టమాటా, క్యాబేజి, మిరప, వంకాయ, ఆకు కూరలు సాగుచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ప్రిన్సిపాల్ రమా కల్యాణి, ఎపీఒ తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఎంపీటీసీ వనజ, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఎఫ్ఎ నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు బీపీ ఆపరేటర్ పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిదిలో విధులు నిర్వహిస్తున్న 9 మంది ఏఎన్‌ఎంలకు సోమవారం పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు బీపీ ఆపరేటర్‌ను పంపిణీ చేశారు. బీపీ ఆపరేటర్‌తో గ్రామ ప్రాంతంలో ఉన్న బీపీ షుగర్ ఉన్న వారికి గర్భిణీలకు చాలా ఉపయోగం పడుతుందని అన్నారు. పంపిణీ కార్యక్రమంలో హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్లు చౌహాన్ చరణ్‌దాస్ సతవ్వ, సిబ్బంది హిమ, అదీప్ ఏఎన్ఏంలు ఉన్నారు.

యువతకు ఉపాధి... సాయి బాలాజీ ఒకేషనల్ కాలేజీ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో 2020 సంవత్సరంలో ప్రారంభమైన సాయి బాలాజీ ఒకేషనల్ కళాశాల ఎంతో మంది యువతకు ఉపాధి అందిస్తోందని కళాశాల కరస్పాండెంట్ తిరుక్కోవేల వెంకటరమణ, ప్రిన్సిపాల్ సీహెచ్ సురేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా గురువారం నవతెలంగాణతో మాట్లాడుతూ తమ ఒకేషనల్ కాలేజీ 2020 సంవత్సరంలో ప్రారంభమై ఇప్పటివరకు 150 మంది విద్యార్థులను ఉత్తీర్ణులుగా చేసి ఉపాధిని కల్పిస్తోందని అన్నారు. అంతేకాకుండా తమ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, బైపీసీ విభాగం, ఏంఎల్టీ, బైపీసీ విభాగము, ఈటీ ఎంపీసీ విభాగం, సీజీటీ బైపీసీ విభాగంలో కోర్సులు జరుగుతున్నాయని అన్నారు. ఈ సంవత్సరం ఎమ్మెల్సీ విభాగంలో జిల్లా టాపర్‌గా తోట సంధ్య, ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అంతేకాకుండా ఇంటర్మీడియట్ విద్యా విధానంతో ఖానాపూర్ మండలంలో ఏకైక వృత్తి విద్య కళాశాలగా ఉంది. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరూ తమ సాయి బాలాజీ ఒకేషనల్ కళాశాలలో చేరి



అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒకేషనల్ కోర్సు రెండు సంవత్సరాల పాటు ఉంటుందని ఇందులో ఉత్తీర్ణత సాధించిన తర్వాత టీటీసీ, డిగ్రీ, ఎంసెట్ ద్వారా ఇంజనీరింగ్ పరీక్షలకు అర్హులని అన్నారు.

చిన్నారులకు ప్రత్యేకం.. సంకల్ప్ పాఠశాల..



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా విద్యానగర్‌లో సంకల్ప్ పాఠశాలను అత్యాధునికంగా, వినూత్న రీతిలో ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల డైరెక్టర్లు కల్వకుంట్ల వినయ్, కొక్కుల ప్రశాంత్, సాధువుల సాయికిరణ్, అల్లాడి జగన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంచే బోధన ఉంటుందని అంతేకాకుండా కేజీ విభాగం విద్యార్థులకు ప్లేవే పద్ధతి ద్వారా బోధించడం జరుగుతుందని తెలిపారు. ఈ పాఠశాలలో నర్సరీ నుండి 5వ తరగతి వరకు నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఈ పాఠశాల 24 గంటలు సీసీ ఫుటేజ్ నిర్వహణ క్లాస్ రూముల్లో చిన్నారులను ఆకట్టుకునే ప్రత్యేక పెయింటింగ్ గోడలపై వివిధ పురాతన కథల పెంటింగ్‌ల ఏర్పాటు ఎల్ఈడీ టీవీలు, కంప్యూటర్లు సైన్స్ లాబ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతి తరగతి గదిలో కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారని వారు తెలిపారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో సోమవారం శాలివాహన కుమ్మరి సంఘానికి రూ.5లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణనికి డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో రూ.12లక్షలతో నిర్మించనున్న మేరు సంఘం నూతన భవన నిర్మాణనికి భూమిపూజ చేశారు. రాబోయే రోజుల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోలేరని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ అన్నారు. అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, అన్ని వర్గాల అభివృద్దే తమ ధ్యేయమని బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, పొట్టపెల్లి సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, చామన్ పల్లి సర్పంచ్ పడిగెల గంగాధర్, మండల రైతు సమన్వయ సమితి చైర్మెన్ శాతం గంగారాం, ఎంపీటీసీలు రమ ముత్యం, అనిత సురేష్, గుజ్జరి గణేష్, నరేష్‌రెడ్డి, శాలివాహన కుమ్మరి సంఘం సభ్యులు, మేరు సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, మండల అధ్యక్షులు గోవర్ధన్, వీడీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తలపెట్టిన హలో విద్యార్థి, చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ముందుగా సంఘం కార్యాలయం నుండి ర్యాలీగా కలెక్టరేట్ కు తరలివచ్చారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రెండు జతలు దుస్తులు ఇవ్వాలని అన్నారు. అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ప్రయివేట్ విద్యా సంస్థలలో ఫీజుల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఎంఈఓ లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ హాస్టలను మెరుగుపరచి మెనూ ప్రకారం భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో విద్యారంగం సమస్యలు రోజురోజుకు



పెరుగుతున్నాయని అన్నారు. అసలు ఈ విద్యారంగాన్ని పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. తక్షణమే ఈ డిమాండ్లను నిర్వహించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ప్రజావాణి విభాగంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్ సోజార్, పంద్ర సంత్రజ్, జుగదిరావు, యాదరావ్, సుధాకర్, ప్రసాద్, జీవన్ ఉన్నారు.

విద్యార్థుల బంగారు భవితకు బాటలు

- క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల
- ఆహ్లాదకర వాతావరణంలో క్యాంపస్
- ప్రతిభగల లెక్చరర్‌లతో బోధన.. ప్లేస్‌మెంట్‌లు



నవతెలంగాణ-ఆర్మూర్(నిజామాబాద్)

సువిశాలమైన ప్రాంగణం. ప్రశాంత వాతావరణం.. అడుగుకో చెట్టు.. ఎటు చూసినా పచ్చదనమే. నందనవనాన్ని తలపించేలా ఆహ్లాదకర వాతావరణం. ఇదెక్కడో కాదు నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణానికి జాతీయ రహదారి 63 చేపూరు దగ్గర గల క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోనే మహామహా కాలేజీలను తలదన్నే విధంగా విద్యాభ్యాసం కొనసాగించిన వారు ఎందరో దేశ విదేశాలలో ఉన్నత స్థానంలో స్థిరపడి తమ జీవితాలను బంగారు భవిష్యత్తుగా మార్చుకున్నారని కాలేజీ యాజమాన్యం పేర్కొంది.


సృజనాత్మకతను వెలికితీస్తూ..

చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో... భూమిని చూసి ఓర్పును నేర్చుకో... చెట్టును చూసి ఎదుగుదలను నేర్చుకో.. గురువును చూసి సుగుణాలు నేర్చుకో అన్నారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. తల్లి తండ్రి తర్వాత గురువే దైవం. ఎంతోమంది గురువులు తమ జీవితాలను త్యాగం చేసి భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్నారు. బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగడం హర్షించదగ్గ విషయం.

2001 ప్రారంభమైన ఇంజనీరింగ్ కళాశాల బీటెక్, పాలిటెక్నిక్, ఎంబీఏల లోని వివిధ కోర్సులలో అత్యంత ప్రతిభ గల లెక్చరర్‌లతో బోధన కొనసాగిస్తూ డిజిటల్ క్లాస్ మెంట్, టాస్కు రిజిస్ట్రేషన్స్, ఇంటర్నెట్ బ్రౌజింగ్ స్పెషాలిటీ, 100 ప్లేస్మెంట్, ఆటలతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఎన్ఎస్ఎస్ ద్వారా సేవ కార్యక్రమాలు సైతం క్షత్రియ ఇంజనీరింగ్ విద్యార్థులు చేపట్టారు. ప్రాజెక్టు వర్క్, ఆన్‌లైన్ కంప్యూటర్ ల్యాబ్, ఈసీఈ, ఈ ల్యాబ్ ప్రత్యేకమైన రూములలో బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయంతో పాటు, ప్రతి ఒక్కరికి తాగేందుకు స్వచ్ఛమైన ఆర్ఓ ప్లాంట్ నీటి సదుపాయం కల్పించారు.

ఉద్యోగ కల్పన తీరుతెన్నులలో

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ కల్పన తీరుతెనులపై అవగాహన సదస్సులు సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి సంబంధించి అనేక సందేహాలను నివృత్తి చేస్తూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగాలను పొందడానికి మార్గాలను గురించి అవగాహన కలిగి ఉండేందుకు కృషి చేస్తున్నారు. అడ్మిషన్లు పొందేందుకు 9490509688, 7780238595, 9989288829 నంబర్లకు సంప్రదించాలని కోరినారు.



వసతుల కల్పనలో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల మహాత్మా గాంధీ నేషనల్ సెంటర్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ కేంద్ర ప్రభుత్వం చే వసతుల కల్పనలో ఏ ప్లేస్ గ్రేడు సర్టిఫికేట్ సైతం పొందింది.

నిపుణులైన అధ్యాపకులతో బోధన

అల్జాపూర్ శ్రీనివాస్, క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్, ఆర్మూర్.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు క్షత్రియ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నిర్విరామ కృషి చేస్తుంది. ఇంజనీరింగ్ ఎంబీఏ తదితర కోర్సులలో చదివిన విద్యార్థులు చదువు పూర్తి చేసిన వారు ప్రతి సంవత్సరం క్యాంపస్ నుండి సుమారు 50, 60 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆర్థిక లావాదేవీలపై అకౌంటెంట్ రాజేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులందరు వారి ఖాతాలకు ఫోన్ నెంబర్లను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఫోన్ నెంబర్‌లు అనుసంధానం చేసుకొంటే తమ ఖాతాలో డబ్బులు జమ అయిన, తీసుకున్న వెంటనే మీకు మెసేజ్ ద్వారా సూచిస్తుందన్నారు. దీనివల్ల ఖాతాలో ఎలాంటి మోసాలు జరిగే అవకాశం ఉండదని తెలిపారు. అలాగే అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఖాతాలకు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాల్లో చేరడం భవిష్యత్తులో ఖాతాదారుడికి ఎలాంటి ప్రమాదం జరిగి చనిపోయినట్టయితే కుటుంబానికి ఆర్థిక సాయంగా బీమా వస్తుందన్నారు. అలాగే అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏండ్లు నిండిన తర్వాత భార్యభర్తలిద్దరికి బ్రతికున్నంత కాలం రూ.వెయ్యి నుండి రూ.5 వేల వరకు ప్రతినెల పెన్షన్ వారి ఖాతాలో జమవుతుందన్నారు. భార్యభర్తలిద్దరు చనిపోయినట్టయితే వారసులకు రూ.1.75 లక్ష నుండి రూ.8.75 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. ఇలాంటి సామాజిక భద్రత పథకాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ జనరల్ పథకం ద్వారా 65 ఏండ్ల వయసులోపు ఉన్న వారు ప్రతి సంవత్సరం రూ.వెయ్యి కట్టడం ద్వారా రూ.20 లక్షల బీమా వర్తిస్తుందని సూచించారు. స్వయం సహాయక సంఘాలన్నీ ప్రతినెల వారివారి చిస్తులు సక్రమంగా కట్టాలని సూచించారు. బ్యాంకులో లావాదేవీలను సక్రమంగా నడుచుకున్నట్టయితే వడ్డీ తగ్గుతూ బోనస్ కూడా వస్తుందని తెలిపారు. ఆయన వెంట క్షేత్రస్థాయి అధికారి మనోహర్ ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే నివాసంలో సమావేశం

కౌటాల : మండలకేంద్రంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ముఖ్య అతిథిగా పాల్గొని ఈ నెల 30న సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు సంబందించిన వివరాలపై చర్చ ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీలు, వార్డు సభ్యులు రైతు సమన్వయ కమిటీ సభ్యులు వస్తున్నందున కౌటాల మండలంలోని అన్ని గ్రామాల నుండి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, రైతు సమన్వయ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలు సోమవారం పక్కనే ఉన్న అడవిలో పనులు చేస్తుండగా చెట్టుపై ఉన్న తేనెటీగలు పెద్ద ఎత్తున దాదాపు 150 మందిపై దాడి చేశాయి. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ జాడి గంగాధర్ హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి వారిని ట్రాక్టర్లలో ఎక్కించుకొని, గ్రామ సమీపాన ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వారికి ప్రథమ చికిత్స అందించారు. ఒకరికి తేనెటీగలు అధికంగా గాయాలు చేయడంతో అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు సర్పంచ్ తెలిపారు. మిగతా వారిని ప్రథమ చికిత్స అందించి వారి ఇళ్లకు పంపినట్లు తెలిపారు. వారికి ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్ క్రాంతికుమార్ తెలిపారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ సంపూర్ణం



నవతెలంగాణ-జన్నారం

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మండలంలో సోమవారం విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి పందిరి మనీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు అందగా విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ప్రభుత్వ పాఠశాలకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించి మౌలిక వసతులను కల్పించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నరు. అదేవిధంగా మన ఊరు మనబడి అనే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని స్పష్టంగా అర్థమవుతుందన్నరు.కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు విచ్చలవిడిగా డొనేషన్ల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను జలగలలాగా పట్టిపీడిస్తోందన్నరు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మండల నాయకులు అక్షయ్ యాదవ్, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదానం శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఆర్టీసీ సిబ్బంది, యువజన సంఘాలు, విద్యార్థులు, అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దాతలు పేరు నమోదు చేసుకోవడానికి 7382841679, 7780219162 నెంబర్లను సంప్రదించగలరని కోరారు.

మాదిగల జనాభా ప్రకారం సీట్లు కేటాయించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో మాదిగ కులస్తుల జనాభా ప్రకారం అన్ని పార్టీలు మాదిగలకు 13 ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి మోతే బారిక్ రావు డిమాండ్ చేశారు. ఈనెల 30న హైదరాబాద్ నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కరపత్రాలను సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని అన్నారు. దళితుల గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచాలని అన్నారు. డప్పు, చెప్పు కార్మికులకు పెన్షన్ ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అడెల్లు, ఉపాధ్యక్షులు ఇస్తారి పాల్గొన్నారు.

టీఎస్ పీఈసెట్‌లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్ పీఈసెట్‌లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. తలమడుగు మండలం లక్ష్మీపూర్‌కు చెందిన మడావి జంగుబాయి స్టేట్ 9వ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్‌లో చదువుతున్న షేక్ ముస్కాన్ స్టేట్ 173వ ర్యాంక్, అంజలి స్టేట్ 487వ ర్యాంక్ సాధించారు. వీరు ఇటీవల బీజీఎస్ అకాడమీలో నెల రోజులపాటు ఫిజికల్ ట్రైనింగ్ తీసుకున్నారు. స్టేట్ ర్యాంక్ సాధించిన వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

దుండగులను శిక్షించాలని రాస్తారోకో

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మహిళపై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని దనోర(బి) గ్రామ ప్రధాన రోడ్డుపై రాస్తా రోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిక్షాటన చేసే అమాయక గిరిజన మహిళను అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమని అన్నారు. దుండగులను కఠినంగా శిక్షించి, బాధిత మహిళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజక వర్గ బాధ్యులు రాంప్రసాద్, రామారావ్, రామేశ్వర్, నాందేవ్ పాల్గొన్నారు.

ఫలితాల్లో ప్రత్యేక ప్రతిభ..!

- పదిలో నిర్మల్..ఇంటర్‌లో ఆసిఫాబాద్
- రాష్ట్రస్థాయిలో మెరిసిన జిల్లా విద్యార్థులు

ఉమ్మడి జిల్లాలో ఇటీవల వెల్లడైన పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పదో తరగతిలో నిర్మల్ జిల్లా ఏకంగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకోగా.. ఇంటర్‌లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల కృషి ఫలితంగా వార్షిక పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలు సైతం పది, ఇంటర్ ఫలితాల్లో పర్వాలేదనిపించే స్థానాల్లో నిలిచాయి. ఉమ్మడి జిల్లా చరిత్రలోనే తొలిసారిగా నిర్మల్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించి ఔరా అనిపించుకుంది. ఇటీవల జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం నిర్మల్ జిల్లా అధికారులను అభినందించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

అక్షర క్రమంలోనే చదువులోనూ ముందు వరుసలో నిలుస్తోంది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. గత కొన్నేండ్లుగా పది, ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ కారణంగా ఈ ఫలితాలు సాధ్యమవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు తొలిమెట్టుగా భావించే పదో తరగతిలో గట్టెక్కించేందుకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహించడం, విద్యార్థులందరిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం మూలంగా ఉత్తీర్ణత శాతం భారీగా నమోదవుతోంది. ఇంటర్‌లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు వార్షిక పరీక్షలకు మూడు నెలల ముందే పాఠ్యాంశాల బోధన పూర్తిచేసి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను తీర్చుతూ ఆయా సబ్జెక్టుల్లో మెరుగయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

పదిలో మనమే టాప్


రాష్ట్రంలో ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా మొదటి స్థానం కైవసం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ జిల్లాలో 9071 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలు పర్వాలేదనిపించగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మాత్రం నిరాశ పర్చింది. ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు విద్యార్థులు 10జీపీఏ సాధించడం విశేషం. మరోపక్క ఇంటర్‌లో వెల్లడైన ఫలితాల్లో మాత్రం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచి అందరిచేత ఔరా అనిపించుకుంది. ఆదిలాబాద్ జిల్లా 8వ స్థానంలో నిలువగా నిర్మల్ జిల్లా 15వ స్థానంలో నిచిలింది. ఆ తర్వాతి స్థానంలో మంచిర్యాల 24వ స్థానానికి పరిమితమైంది. స్థానాలు దిగజారినా ఉత్తీర్ణత శాతం మాత్రం మెరుగుపడటం సానుకూలంగా మారుతోంది.

బాధిత కుటుంబానికి పరామర్శ



బజార్‌హత్నూర్ : మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన గెడం కాశీనాథ్ కుమారుడు నందకిషోర్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు నీలాదేవి సోమవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ గుంజల భాస్కర్‌రెడ్డి, బజార్‌హత్నూర్ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, కుంరం శంభు, సర్పంచ్ పెందుర్ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలు తొలగించాలి



కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లో విచ్చలవిడిగా వెలిసిన మద్యం బెల్ట్ దుకాణాలను తొలగించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బెల్ట్ దుకాణాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. బెల్ట్ దుకాణాలకు ప్రభుత్వమే లైసెన్స్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లుగా వ్యవహారం కొనసాగుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఈ బెల్ట్ దుకాణాలను నివారించాలని డిమాండ్ చేశారు.

పుస్తక పఠనం ద్వారా మేధోశక్తి పెంపు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పుస్తక పఠనం ద్వారా మేధోశక్తి పెరుగుతుందని జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి ఉదయ్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని చింతగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారితో పాటు అకడమిక్ మానిటరింగ్ సెక్టోరల్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. కథల పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా ఉదయ్‌బాబు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల పఠనా నైపుణ్యంపెరుగుతుందని అన్నారు. ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఒక పీరియడ్‌ను గ్రంథాలయానికి కేటాయించి విద్యార్థులలో రీడింగ్ అలవాటు పెరిగేలా చూడాలని సూచించారు. మానిటరింగ్ సెక్టోరల్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ బడీడు పిల్లలలో పఠనానైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా పఠనోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈ రోజు ప్రారంభించినట్లు తెలిపారు. జులై 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు జి స్వర్ణ, మండల విద్యాధికారి గడ్డం భిక్షపతి, జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, నోడల్ అధికారి జాడి దేవాజీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్, సర్పంచ్ ఆత్రం సంజీవ్, ఎంఎంసీ ఛైర్మన్ జాడి సంగీత, ప్రధానోపాధ్యాయుడు కొమ్ము లక్ష్మినారాయణ, నాయకులు నాగేందర్, సీఆర్‌పీ మధూకర్ పాల్గొన్నారు.

పట్టణోత్సవ కార్యక్రమం ప్రారంభం



నవతెలంగాణ-దండేపల్లి

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పట్టణోత్సవ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి యాదయ్య మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం నేటి నుండి ఈ నెల 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులను హిందీ, తెలుగు, ఇంగ్లీష్ భాషలలో ప్రావీణ్యులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా శ్రీకారం చుట్టిందని, జిల్లాలో మండలంలో మొట్టమొదటిగా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కాసుల రవీందర్, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి హైస్కూల్‌లో స్వచ్ఛత పక్వాడ



నవతెలంగాణ - రెబ్బెన

సోమవారం బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్ ఆదేశాల మేరకు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి ఏరియాలో గోలేటిలోని సింగరేణి హైస్కూల్ విద్యార్థులకు స్వచ్ఛత అనే అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించారు. గెలుపొందిన వారికి జీఎం చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, జూనియర్ ఫారెస్టు అధికారి నవీన్, ఉపాధ్యాయులు లావణ్య, కవిత పాల్గొన్నారు.

ఆలయ కమిటీ కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ కమిటీ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా తంగెడిపల్లి మహేష్, ఉపాధ్యక్షులుగా కనుకుట్ల శ్రీనివాస్, సూర్ల ఇస్తారి, ప్రధాన కార్యదర్శిగా కోండ్ర నరేందర్‌గౌడ్, కోశాధికారిగా దేవనపల్లి నరేందర్, కార్యదర్శిగా రాచకొండ నాగేష్, సహాయ కార్యదర్శులుగా రంగు సురేష్‌గౌడ్, శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా గుమ్ముల శ్రీనివాస్, దామోదర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గోహత్య నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గోహత్య నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి అన్నారు. భారతీయ గోవంశ రక్షణ సంవర్ధన పరిషత్ ఆధ్వర్యంలో ప్రచురించిన వాల్ పోస్టర్లను పట్టణంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో సోమవారం ఆవిష్కరించారు. గోవును జాతీయ రాణిగా ప్రకటించాలన్నారు. గోరక్షణ కొరకు గ్రామ గ్రామాన నెలరోజులపాటు జన జాగరణ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దశరథ్ పటేల్, గణేష్, శ్రీరామ్, దత్తు పాల్గొన్నారు.

పలకరించిన వర్షం..అన్నదాతల్లో హర్షం..!

- జిల్లా అంతటా విత్తనాలు నాటుతున్న రైతులు
- జిల్లాలో ఊపందుకుంటున్న ఖరీఫ్ పనులు
- ఈ ఏడాదిలో ఇప్పటికీ లోటు వర్షపాతమే నమోదు
- మరో రెండు రోజుల భారీ వర్ష సూచన
- రైతుల్లో ఆనందం.. కళకళలాడుతున్న మార్కెట్

మృగశిరకార్తె ముగిసిన వెంటనే అనేక మంది అన్నదాతలు విత్తనాలు వేశారు. ఒకటి, రెండు రోజులు అటు ఇటు అయినా వర్షం వస్తుందనే భరోసాతో నాటారు. కానీ రెండు వారాలు దాటినా వర్షం జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. రైతులు ఓ వైపు విత్తనాలు నాటడం.. మరోవైపు వ్యవసాయశాఖ ఇప్పుడే విత్తుకోవద్దని సూచనలు చేయడంతో మరింత ఆందోళన చెందారు. కానీ కొంత ఆలస్యమైనా ఓ మోస్తారు వర్షాలు రావడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో వ్యవసాయ కుటుంబాల్లోనే కాకుండా వాటిపై ఆధాపడిన అనేక కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తి, సోయా విత్తనాలు వేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. మరోపక్క ఈ ఏడాది ఇప్పటి వరకు కురవాల్సిన వర్షం కంటే ఇంకా లోటుగానే నమోదుకావడం గమనార్హం.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో అధికశాతం రైతులు వర్షాధారం మీదనే ఆధారపడి పంటలు పండిస్తుంటారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 16.80లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా.. ఇందులో పత్తి ఏకంగా 11లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. ఈ ఏడాది రైతులకు అవసరమైన విత్తనాల కొరత వేధించినా..చివరకు సరిపడా విత్తనాలు జిల్లాకు చేరుకోవడంతో ఈ సమస్య త్వరగానే పరిష్కారమైంది. ఎలాగో వర్షం వస్తుందనే భరోసాతో అనేక మంది రైతులు మృగశిరకార్తె దాటగానే విత్తనాలు నాటారు. అధిక శాతం పత్తి విత్తనాలు నాటగా.. సోయా కోసం కొంత సమయం వేచిచూశారు. కానీ జూన్ మొదటి వారంలోనే వర్షాలు రావాల్సి ఉన్నప్పటికీ సుమారు రెండు వారాల పాటు ఆలస్యమయ్యాయి. దీంతో ఇప్పటికే నాటిన విత్తనాలు పనికిరాకుండా పోతాయని అనేక మంది రైతులు ఆందోళనకు గురయ్యారు. మరోపక్క కొందరు రైతులు ఆ సమయంలో నాటకుండా వర్షాల కోసం వేచిచూశారు. రెండు వారాల పాటు వర్షం కోసం ఆకాశం వైపు చూసిన అన్నదాతలకు నిరాశే ఎదురైంది. తాజాగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.



ఇప్పటికీ లోటు వర్షపాతమే నమోదు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 158.8 మి.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉంటుంది. కానీ కేవలం 45మి.మి వర్షపాతమే కురిసింది. దీంతో ఇంకా 100మి.మికి పైగా లోటు వర్షపాతం కనిపిస్తోంది. రెండు వారాల పాటు వర్షం రావడం ఆలస్యమైనా పంటలకు అంతగా నష్టం జరిగే పరిస్థితులు లేవని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఒకవేళ జూన్ మొదటి వారంలోనే వర్షాలు వస్తే ఇప్పటికే విత్తనాలు మొలకెత్తి మొక్కలు పెరిగి ఉండేవని...జూలైలో కురిసే వర్షాలతో మరింత ఏపుగా పెరిగేందుకు ఆస్కారం ఉండేదని చెబుతున్నారు. జులై 15వరకు విత్తుకునేందుకు అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే పత్తి విత్తనాలు 80నుంచి 90శాతం మంది రైతులు నాటడంతో తాజాగా కురిసిన వర్షం వారికి ఎంతగానో మేలు చేస్తుందని చెబుతున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెబుతుండటంతో నాటిన విత్తనాలు మొలకెత్తేందుకు అవకాశం ఉంటుంది. మరోపక్క జిల్లాలో పంట చేలన్ని రైతులు, కూలీలతో కళకళలాడుతున్నాయి. వ్యవసాయ పనులు జోరందుకోవడంతో వాటి అనుబంధ రంగాలు ఊపుమీదున్నాయి. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణాలు రైతులతో కళకళలాడుతున్నాయి. మరోపక్క వేసవి తాపాన్ని భరించలేక ఉక్కపోతతో ఇబ్బందులు పడిన జనాలకు తాజా వర్షం ఉపశమనం కలిగిస్తోంది. వాతావరణం చల్లగా మారడంతో జనం ఊపిరి పీల్చుకుంటున్నారు.

విత్తనాలు వేసేందుకు సరైన సమయం : డా.శ్రీధర్‌చౌహాన్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త



జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో విత్తనాలు వేసేందుకు ఇది సరైన సమయం. ప్రస్తుతం జిల్లాలో ఓ మోస్తారు వర్షం కురిసింది. మరో రెండు రోజుల పాటు ఇలాగే కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతోంది. ఇప్పటికే రెండు వారాలు ఆలస్యమైనా పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. జులై మొదటి వారం వరకు కూడా విత్తనాలు వేసేందుకు అవకాశం ఉంటుంది.

సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ కలెక్టరేట్ ముట్టడి



నవతెలంగాణ-నస్పూర్

విద్యాలయాల్లో నెలకొన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, నస్పూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి సత్యనారాయణ, అభినయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య రంగానికి సంబంధించి ఎన్నో సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా అందులో ప్రభుత్వ పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్ అందించాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. మన ఊరు-మన బడి పథకం అన్ని పాఠశాలలకు వర్తింపజేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్, గురుకుల, యూనివర్సిటీ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. ముఖ్యంగా విద్యార్థి చట్టం ప్రకారం 2009లో పేద విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లు కేటాయించి వెంటనే అమలు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. 2014లో జిల్లా ఏర్పడిన తర్వాత గతంలో ఎస్సీ హాస్టల్ విద్యార్థుల భవనాన్ని తీసుకొని దాన్ని కలెక్టరేట్ కోసం వినియోగించారని, నూతనంగా కలెక్టరేట్ భవనం నిర్మించినందున తిరిగి ఆ పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ హాస్టల్ విద్యార్థినులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, చిరంజీవి, రాకేష్, శ్రవణ్, అరుణ్, సమ్మయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో విజయవంతం చేసే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30న సీఎం పర్యటనలో భాగంగా సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయం, జిల్లా పోలీసు కార్యాలయం ప్రారంభోత్సవం, కొమురం భీం, కొట్నాక భీమ్‌రావు విగ్రహాల ఆవిష్కరణ, బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం కార్యక్రమాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు ఉన్నందున శాఖల అధికారులు సమన్వయంతో పర్యటన విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్, వాహనాలను సిద్ధంగా ఉంచాలని, సంబంధిత శాఖల అధికారులు ప్రవేశ పాసులు తీసుకుని జిల్లా అధికారులకు మధ్యాహ్న భోజన వసతి, ప్రముఖులకు అల్పాహారం, అవసరమైన ఏర్పాట్లు, ఆయా అధికారులకు కేటాయించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. తాగునీరు సిద్ధంగా ఉండాలని, ప్రముఖులకు స్వాగతం పలికే అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రముఖులకు కేటాయించిన గదులలో అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు రానున్నందున అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బహిరంగ సభ ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలని, వాహనాల పార్కింగ్ ఇతర ఏర్పాట్లను చేపట్టాలని, ఎస్‌పిఎంలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తారని, జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల వారీగా ఆరుగురు చొప్పున లబ్దిదారులను ఎంపిక చేసి పట్టాలు అందించడం జరుగుతుందని తెలిపారు. మీడియా పాసులు, ప్రోటోకాల్, ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలని, విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పూలాలంకరణ ఏర్పాట్లపై ఉద్యానవన శాఖ అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. కలెక్టరేట్ భవనాన్ని పూలతో, విద్యుత్ కాంతులతో అలంకరించాలని తెలిపారు. సీఎం వాహన శ్రేణి, ఇతర వాహనాలు, ఏర్పాట్లపై అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రాజేశ్వర్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కాంటాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ప్రజలకు సేవ చేస్తున్నప్పటికీ కార్మికుల సేవలను గుర్తించడం లేదన్నారు. కనీస వేతనాల జీవో అమలు చేయకుండా, పిఆర్సీ వేతనాల జీవో 60ని అమలు చేయకుండా అతి తక్కువ వేతనాలతో కంపెనీ యాజమాన్యం వెట్టిచాకిరి చేయించడం దారుణమన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్ల వేధింపులు, తొలగింపులు ఆపాలని, అదనంగా పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. సోమవారం ధనోర ప్లాంట్ దగ్గర మూడు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన నిర్వహిస్తే, కనీసం సమస్య పరిష్కరించడానికి సంబంధిత కంపెనీ యాజమాన్యం గానీ, అధికారులు గానీ పరిష్కార మార్గం చూపెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధుకర్, అంబాజీరావు, దేవేందర్, హరీష్, వెంకటేష్, శుభం, బాలేష్, క్రాంతిదీప్ పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పటిష్టంగా బీజేపీ



నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ పటిష్టంగా ఉందని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మరింత పటిష్టం చేసేందుకు త్వరలోనే భారీ చేరికలు ఉంటాయని వెల్లడించారు. నిర్మల్‌లో బీజేపీ నుంచి ఒకరిద్దరు పోయినంత మాత్రన నష్టమేమిలేదని, ఇప్పటికే చాలా మంది ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా చేరారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో నిర్మల్‌లో బీజేపీ జెండా ఎగరరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాయ మాటలు నిర్మల్ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, నియోజకవర్గమంతా పక్కన పెట్టి తన సొంతూరు ఎల్లపల్లిలో ఆర్భాటంగా ఆరంభించిన డబుల్ బెడ్ రూంలలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. తొమ్మిదిన్నర ఏళ్లుగా తన కుటుంబ సభ్యుల, అనుచరుల ఆస్తులు పెంచుకునేందుకు ప్రయత్నించారే తప్ప ఏ రోజు అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఇంకా ఆరు నెలల సమయమే ఉన్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. నిమ్మరాజులు కట్టించిన గొలుసుకట్టు చెరువులను మాయం చేసి, నిర్మల్‌ను నిండా నీళ్లతో ముంచిన ఘనత మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. చిన్న వర్షానికే నిర్మల్ పట్టణం చెరువును తలపిస్తోందని గుర్తు చేశారు. ఇప్పుడు వానకాలం సీజన్ ప్రారంభమైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రజలను విస్మరించిన మంత్రికి ఈసారి వారే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్ పాల్గొన్నారు.

పీఎంఎఫ్‌ఎంఈ యూనిట్ ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) పథకం కింద మహిళా సంఘం సభ్యురాలికి మంజూరైన యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. మండలంలోని చింతగూడ కోయవాగులోని గౌతమబుద్ధ గ్రామైక్య సంఘంలోని జాఫర్ సాదిక్ మహిళా సంఘ సభ్యురాలైన సమీనా బేగంకు ఈ పథకం కింద రూ. 3 లక్షలు మంజూరు కాగా దీనితో బేకరీ యునిట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు సిద్దిక్, సర్పంచ్ లక్ష్మి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ప్రశాంత్, ఎపీఎం ముక్తేశ్వర్, వీఓ ఓబీలు, వీఓఎస్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జనరల్ మేనేజర్ నరసింహారావు ఇటీవల పదవి విరమణ పొందిన సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, ఎస్‌టిపిపి మేనేజర్ సూర్య నారాయణరాజు బంగ్లా ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా సంస్థలో వివిధ హోదాల్లో పనిచేసి సంస్థ పురోగతిలో నరసింహారావు చేసిన కృషి అమోఘమని తెలిపారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా అన్ని విభాగాల, గనుల అధిపతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను వాడొద్దు : అదనపు ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో పరివర్తన వాక్‌ను చేపట్టారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానం నుంచి ప్రారంభమైన వాక్ ప్రధాన వీధుల గుండా సాగింది. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రజలకు అవగాహనా కల్పించారు. డీసీపీఓ రాజేంద్ర ప్రసాద్, సీఐలు సత్యనారాయణ, గుణవంత్ పాల్గొన్నారు.



పాఠశాలల్లో పఠనోత్సవం ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ పాఠశాలను సోమవారం రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుల బృందం సభ్యులు అశోక్, ప్రతాప్, నారాయణ వర్మ సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించారు. పఠనోత్సవంలో భాగంగా విద్యార్థులతో ధారాళంగా చదివించడం, చదివిన విషయాన్ని ఏ విధంగా గుర్తుంచుకోవాలి అవగాహన చేసుకోవాలో రాష్ట్ర పరిశీలకులు క్లుప్తంగా విద్యార్థులతో వివరించారు. పఠనోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి నర్సయ్య, స్పెషల్ ఆఫీసర్ నవిత, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సుధాకర్, మహేందర్ పాల్గొన్నారు.



ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదు...

- ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు
- టమాటా కిలో రూ.100



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రోజుకు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో బేజారవుతున్న జనం కొలుకొక ముందే కూరగాయల ధరలు సైతం చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో కొనుగోలు దారులు కూరగాయలు కొనాలంటేనే ఒక అడుగు వెనక్కి వేస్తున్నారనటంలో సందేహం కలుగ మానదు. కూరగాయల ధరలు ఒకే సారి భగ్గుమనడంతో రోజు వారి కూలీ నాలీ చేసి కుటుంబాన్ని పోషించే పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సోమవారం ఇంద్రవెల్లి వారాంతపు సంతలో కిలో టమాటా ధర రూ.100 పలికింది. పచ్చి మిర్చి రూ.120, క్యాబేజీ రూ.120, సిమ్లా మిర్చి రూ.100, అలసంద రూ. 60, బెండకాయ రూ.60, వంకాయ రూ.60, కాకరకాయ రూ.80, ఆలు గడ్డ రూ.60, ఎల్లిగడ్డలు రూ.120 ధర పలుకడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తు తున్నారు. ఎండ కాలంలో లేని ఈ ధరలు ఖరీఫ్ సీజన్‌లో ఉండటంతో ప్రజలు ఏమి తినేటట్లు లేదని వాపోతున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు పొరుగున ఉండే మహారాష్ట్రలోని లాతూర్ నుంచి లేదా మన పక్క జిల్లా నిజామాబాద్ అంకాపూర్ నుంచి టమాటా వచ్చేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. అక్కడ వర్షాభావ పరిస్థితి వల్ల టమాటా పంట దెబ్బతిందన్నారు. దీంతో టమాటా ధర ఆకాశాన్నంటుతోంది.పేద ప్రజలపై భారం పడుతుంది.ఇప్పుడేమో అనంతపురం, చిత్తూరు జిల్లా మదినేపల్లి టమాటా మన జిల్లాకు వస్తోంది. మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాలకు సప్లై కావడంతో టమాటాకు విపరీతంగా డిమాండ్ పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మరో రెండు నెలల పాటు ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉంటుందని కూర గాయాల వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి.

టమాటా ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం...

- మహబూబ్ వ్యాపారి



క్యారట్ (25 కిలో) రూ.1700 పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో చిత్తూరు మదినేపల్లి నుంచి టమాటా దిగుమతి అవుతోంది. ఒక్కో క్యారట్‌కు 1700 వందకు పలుకుతోంది. పచ్చి మిర్చి కరీంనగర్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి మన మార్కెట్‌కు వస్తోంది. మన ప్రాంత రైతులు మిర్చి పంటను పండిస్తే ధరలు తగ్గుతాయి. వర్షాలు సకాలంలో కురువక పోవడంతో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి.

కుటుంబ పోషణ భారమవుతోంది

- రాంబాయి గృహిణి



ప్రతి రోజు ఉపయోగించే టమాటా, మిర్చి ధరలు విపరీతంగా పెరగడం వలన కుటుంబ పోషణ భారమౌతుంది. ఏదీ తీసుకున్న వందకు తక్కువ ధర లేదు. ప్రతిసారి కిలో కూరగాయలు కొనేవాళ్ళం. ఇప్పుడేమో పావుతో సరిపెట్టుకుంటున్నాం. ఇలాగైతే పేద ప్రజలు పప్పు నీళ్లు తప్ప వేరే కూరగాయాలు తినే పరిస్థితులు లేవు.

అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆయన స్వీకరించారు. భూసంబంధ సమస్యలు, విద్యా, ఫించన్, ఉపాధి కల్పన, పౌర సరఫరాలు, రెవెన్యూ, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు, తదితర సమస్యలపై అర్జీలను కలెక్టర్ స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆయా శాఖాధికారులకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేయాలని అన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించెలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి తల్లదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం శాఖల వారిగా పెండింగ్ ఉన్న దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ ప్రజావాణిలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో సోయా విత్తనాలు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోయా విత్తనాల అందుబాటులో ఉన్నాయని సీఈఓ కేశవ్ తెలిపారు. 25 కేజీల జెఎస్ 9305 రకం బ్యాగు ధర రూ.2వేల 600 అలాగే జెఎస్ 335 రకం బ్యాగు ధర రూ.2వేల 400 ఉందన్నారు విత్తనాలు అవసరం ఉన్న రైతులు తప్పనిసరిగా తమ వెంట పట్టాపాస్ బుక్ జిరాక్స్ తీసుకొని రావాలని అన్నారు. మండలంలోని రైతులకు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

మంత్రి ఐకేరెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్

అసిఫాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న క్రమంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని సోమవారం మండలంలోని ఎక్స్ రోడ్డులోని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరాం నివాసానికి చేరుకున్నారు. మంత్రి ఐకేరెడ్డితో పాటుగా మాజీ మంత్రి, మాజీ ఎంపీ గోడం నగేష్ రావడంతో పార్టీ నాయకులు స్వాగతం పలికి మొక్కలను అందించారు. కాసేపు ముచ్చటించారు. ఏజెన్సీలో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న పోడు భూముల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి పార్టీ నాయకులు వివరించారు. స్పందించిన మంత్రి సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, మండల అధ్యక్షులు తన్నీరు సతీష్. నాయకులు స్వామి, నరేందర్, కిషోర్ ఉన్నారు.

విద్యాసంస్థలు బంద్ ప్రశాంతం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా సాగింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని తెరిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. తరగతి గదుల్లో తిరుగుతూ విద్యార్థులను బయటకు పంపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రయివేట్‌లో ఫీజు దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ పట్టణ కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. అలాగే ఏబీవీపీ బంద్ నేపథ్యంలో పలు ప్రయివేటు విద్యాసంస్థలు ముందుగానే సెలవును ప్రకటించాయి. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, అరుణ్, నిఖిల్, అఖిలేష్, సంజయ్ ఉన్నారు.

వర్షంలో దివ్యాంగుల ఆందోళన : స్పందించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దివ్యాంగులకు ప్రత్యేకంగా కాలనీని కేటాయించడంతో సహా ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగులు గత 142 రోజులుగా నిరువధిక దీక్ష చేపడుతున్నారు. అందులో భాగంగానే సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి ఫిర్యాదుల విభాగానికి తరలివచ్చి వర్షంలోనే తమ నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రస్తావిస్తూ పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్ రాజ్ బయటకు వచ్చి వారి నుండి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి తనవంతుగా అన్ని చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు.

పట్టణాభివృద్ధికి కేంద్ర నిధులిచ్చింది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి కేంద్రం నిధులిచ్చిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. సోమవారం గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గడపగడపకు బీజేపి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో విస్తృతంగా పర్యటించి బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట బీజేపీ నాయకులు వెంకటొరెడ్డి, సంతోష్, ముఖీమ్, కాంత, అశాంత్, పవన్, శివకిరణ్, రోహిదాస్ ఉన్నారు.

కురిసిన వర్షం.. మురిసిన రైతు..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రోహిణి కార్తె ఆరంభమై ఇరవై రోజులు కావస్తున్న ఆశించిన స్థాయిలో వర్షం కురువలేదు. రైతన్న విత్తనాలు విత్తి కారుమబ్బుల వైపు చూస్తుండగా.. సోమవారం ఆశించిన స్థాయిలో తొలకరి జల్లు కురువడంతో రైతన్న మురిసిండు. కురిసిన వర్షంతో విత్తనాలకు ఊపిరి పోసినట్లు అయిందని రైతన్న పేర్కొంటున్నారు.

సంఘం ప్రహరీగోడ నిర్మాణానికి రూ.2.50లక్షలు మంజూరు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కనుగుట్ట గ్రామంలోని మున్నూరు కాపు సంఘం ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీపీ తుల శ్రీనివాస్ రూ.2.50 లక్షల ప్రొసిడింగ్‌లను సోమవారం పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్ చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేశారు. అలాగే కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీపీ ఐదు నెలల వ్యవధిలో కన్గుట్ట మున్నూరుకాపు సంఘానికి రూ.7.50లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మున్నూరుకాపుల తరపున ఎంపీపీకి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు భీమా అశోక్, నాయకులు మిత్కరే రాజేశ్వర్, అల్లంకొండ ప్రశాంత్, రుప్ సింగ్ పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సివిల్స్ ర్యాంకర్ భార్గవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల సివిల్స్‌లో 554 వ ర్యాంకు సాధించిన ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సివిల్స్ ర్యాంకర్ మద్దెల భార్గవ్ సోమవారం డిప్యూటీ స్పీకర్ పద్మరావుగౌడ్‌ను హైదరాబాద్‌లో పుష్పగుచ్ఛాన్ని అందించి, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్గవ్‌ను అభినందించి, స్పీకర్ శాలువా కప్పి సన్మానించారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పాశం రాఘవేంద్ర, కార్పొరేటర్లు, మేయర్లు ఉన్నారు.

బోథ్ ఎమ్మెల్యేను పరామర్శించిన మంత్రి



నవతెలంగాణ-బోథ్

బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ప్రయాణించే వాహనం రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే నివాసంలో ఆయనను పరామర్శించి, ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, తలమడుగు మండల కన్వీనర్ తోట వెంకటేష్, పీఏసీఎస్ చైర్మెన్ వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు వసంత్‌రెడ్డి, నాయకులు మగ్గిడి ప్రకాష్, దేవాపూర్ సర్పంచ్ అబ్దుల్లా, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, దూస సంతోష్, మహేష్, ఉండం సర్పంచ్ నర్సింలు, రుయ్యాడి సర్పంచ్ పోతారెడ్డి, నాయకులు నారాయణ, సుభాష్, జావిద్ పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో అన్ని కోర్సులను ప్రారంభించాలి

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి పీజీ కళాశాలలో అన్ని కోర్సులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ఉన్న స్కాలర్షిప్, ఫీజ్ రియంబర్స్‌మెంట్ గత అనేక సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నారని, ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఈ సంవత్సరం అనేకచోట్ల పెండింగ్ పాఠ్యపుస్తకాలు ఉన్నాయని, తక్షణమే పంపిణీ చేయాలని అన్నారు. అలాగే విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ బడులను మన ఊరు మనబడి పథకం కింద చేర్పించాలని అన్నారు. మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. చాలామంది పేద విద్యార్థులు బీసీ వసతి గృహ ప్రవేశాలకు ఆన్‌లైన్ చేయని పరిస్థితులు ఉన్నాయని, వెంటనే ఆన్‌లైన్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్స్, గురుకులాలకు విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని అన్నారు. గురుకులాలకు, సంక్షేమ వసతి గృహాలకు పక్క భవనాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పక్కా భవనాలు నిర్మించాలని అన్నారు. ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గ కేంద్రాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక వందల కిలోమీటర్ల వెళ్లి చదువుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వెంటనే బడుగు బలహీన, పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర బాలికలకు మేనేజ్మెంట్ హాస్టల్స్ ప్రారంభించాలన్నారు. జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి, అన్ని కోర్సులు ప్రారంభించాలన్నారు. అలాగే చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి బస్ పాస్ ఉచితంగా ఇవ్వాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల పోస్టులని భర్తీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నామత్కార్ నవీన్, ముధోల్ డివిజన్ కార్యదర్శి గడపాలే పరమేశ్వర్, నాయకులు అనిల్, వంశీ, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వనజకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పెన్షన్ సమస్యలు పేరుకు పోయాయని, వెంటనే సీఎం కేసీఆర్ కలుగజేసుకొని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనారోగ్య కారణాలతో ఆస్పత్రులలో లక్షల రూపాయల బిల్లులు చెల్లించాల్సి వస్తున్నందున ఒకటవ పీఆర్సీ ప్రకారం వాళ్లకు మూలవేతనం ఒకటి శాతం మినాయించి పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని అన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్లు చెల్లించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సీఎం కేసీఆర్ పెన్షనర్ల పరిస్థితులను అర్థం చేసుకొని న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అయ్యన్న, కార్యదర్శి లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, కోశాధికారి తోట నర్సింలు, ఉపాధ్యక్షులు దానమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణరెడ్డి, సుమ, ఉశన్న, లింగన్న, సంతోష్, కాంతారావు, మల్లేష్ పాల్గొన్నారు.

వసతి గృహ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనుసందానంగా ఉన్న పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతి గృహంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బైరి సోమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యార్థులతో కలిసి ఆయన ఐటీడీఏకు వెళ్లి అక్కడ పీవీటీజీ ఏపీఓ భాస్కర్‌ను కలిసి సమస్యలపై విన్నవించి, వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వసతి గృహంలో సుమారుగా 400మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారని, అక్కడ కనీసం తాగేందుకు నీటి సౌకర్యం లేదని పేర్కొన్నారు. మరుగుదొడ్లకు సైతం నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు గదులు సరిపోవడం లేదని, అదనపు గదులను మంజూరు చేయాలని కోరారు. దీనిపై గతంలో కూడా అధికారులను కలిసి విన్నవించామని తెలియజేశారు. అయిన ఎవరు స్పందించడం లేదన్నారు. వసతి గృహంలోని సమస్యలన్ని పరిష్కరించకుంటే సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో ఈ సంఘం నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

హేటిలో రేషన్ షాప్ ఏర్పాటు

నవతెలంగాణ-బేల

మండలంలోని హేటి గ్రామంలో రేషన్ సబ్ సెంటర్ ఏర్పాటుకు అధికారులు సర్క్యులర్ జారీ చేశారని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్ రెడ్డి అన్నారు. ఇటీవల హేటి గ్రామస్తులు రేషన్ సరుకుల కోసం ప్రతి నెల మండలంలోని బాది గ్రామానికి వెళ్లి సరుకులను తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మండల, జిల్లా అధికారులను కలిసి వినతిపత్రం అందించడం జరిగిందని అన్నారు. దీంతో స్పందించిన అధికారులు హేటి గ్రామంలో రేషన్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సర్క్యులర్ జారీ చేయడం పట్ల గ్రామస్తుల, యూత్ కాంగ్రెస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.హేటి గ్రామస్తులు వారి సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అధికారులను కలిసి సమస్యను పరిష్కరించేలా చూశామన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గ్రామాల్లో తిరుగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అదేవిధంగా బేల మండల ప్రజలకు ఎప్పుడు యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ సమస్యలున్న మండల అధికారుల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బేల మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ గుండావార్, మడావి చంద్రకాంత్, అవినాష్ గోడే, బొక్రే శంకర్, నరేందర్, గ్రామస్తులు గుణవంత్‌రావు, చాట్‌పెల్లి రాజేశ్వర్, రుమల రాందాస్, కృష్ణ, రాజు ఉన్నారు.

ఘనంగా వీపీ సింగ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వీపీ సింగ్ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ రాజకుటుంబంలో పుట్టిన బడుగు బలహీన వర్గాల సంక్షేమ కోసం తపించిన గొప్ప వ్యక్తి వీపీ సింగ్ అని కొనియాడారు. బీసీల రిజర్వేషన్ ఆయనతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతి, జిల్లా యువజన సంఘ గౌరవ అధ్యక్షులు గుర్నులే మారుతి, సోన్నాయిల ఉమేందర్ పాల్గొన్నారు.

పాఠశాలలో పఠనోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని బారెగుడా ప్రాథమికోన్నత పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ప్రధానోపాధ్యాయులు తాటి రవీందర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదవడం నేర్చుకోవాలి, నేర్చుకోవడానికి చదవాలి, ప్రతి విద్యార్థి చదివేలా చూడాలి అనే లక్ష్యంతో జూలై 31 వరకు పఠనోత్సవం కొనసాగుతుందన్నారు. ప్రతి తరగతికి రోజు పుస్తక పఠనం కోసం ఒక గ్రంథాలయ పీరియడ్ కేటాయించడం జరుగుతుందని, వారంలో మూడు రోజులు మాతృభాష, మూడు రోజులు ఆంగ్ల భాషకు సంబంధించిన కథల పుస్తకాలు, పాఠ్యాంశాల పుస్తకాలు, గ్రంథాలయ పుస్తకాలను చదివించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్లె విమల సంతర్, ఉపాధ్యాయులు కరుణాకర్ రావు, నాగ గంగాధర్‌రెడ్డి, మహాత్మా సరిత, గుంటుక సునీత, కొలిపాక భార్గవి పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు పెరిగిన వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-కౌటాల

మధ్యాహ్నభోజన కార్మికులకు పెరిగిన వేతనం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఆర్‌ఐ సుమన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ 2022 మార్చిలో మధ్యాహ్నభోజన కార్మికులకు వేతనాలు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించిన నాటి నుంచి ఇప్పటివరకు ఇవ్వడంలేదని, మధ్యాహ్నభోజనం బిల్లులలో సైతం పెంచిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను తక్షణమే అందించాలన్నారు. మధ్యాహ్నభోజన కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, నెలవారీగా బిల్లులు చెల్లించి, వేతనం చెల్లించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు హంస, శారద, మధునక్క, పార్వతి, విమల, ఇందిరా, కమల, లక్ష్మి, రెకాబాయి పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రైస్‌మిల్లుల్లో హమాలీ కార్మికులుగా పని చేస్తున్న వారికి పెరిగిన నిత్యవసర సరుకులకు అనుగుణంగా యాజమాన్యాలు కనీస వేతనం ఇవ్వకుండా వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాల క్యాంపెనింగ్‌లో భాగంగా మండలంలోని వివిధ రైస్‌మిల్లులను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుగుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లుల యాజమాన్యాలు హమాలీ కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారని, వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కూడా యాజమాన్యాలు కల్పించకపోవడం విచారకరమన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వారి కుటుంబాలకు ఎవరు భరోసా కల్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు కావస్తున్నా 75వ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ సుమారు కోటి 20 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, కనీస వేతన చట్టం 1948 ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి సవరించి పెంచాలని, రెండుసార్లు కార్మికుల వేతనాలు సవరించి వాటిని అమలుచేయాలని, అలాగే కరువు బత్యం 2023 సెప్టెంబర్ వరకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హమాలీ, ఇతర కార్మికులు ఎలుములె రవీందర్, మాలపెల్లె దిలీప్, దందిరె హిరావన్, విలాస్, బాలాజీ, రాకేష్, రమేష్ పాల్గొన్నారు

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రిటైర్డ్ ఉద్యోగులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన రెండు డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఈహెచ్ఎస్‌ను అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో అనుమతించాలని, కొత్త పీఆర్‌సీ కమిటీని నియమించాలని, 398 వేతనంలో నియమింపబడ్డ ఉపాధ్యాయులకు నేషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, మృతి చెందిన రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబసభ్యులకు దహన సంస్కార ఖర్చులను వెంటనే చెలించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. 15 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించని పక్షంలో తదుపరి కార్యాచరణ తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్‌ఉద్యోగుల సంఘం కార్యదర్శి శివప్రసాద్, ఉపాధ్యక్షులు బి నర్సయ్య, సభ్యులు ఎం మహబూబ్, ఎం సుభాష్, మురళీదర్‌రావు, రామయ్య, రాజయ్య, అల్లి రాజయ్య, కె నర్సయ్య పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో ఆంగ్ల బోధనకు నియామక ప్రక్రియ

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి పట్టణం లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి గాను అడహక్ ప్రాతిపదికన ఆంగ్ల ఉపాధ్యాయ నియామకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ తెలిపారు. డిగ్రీలో ఇంగ్లీష్ మెయిన్ సబ్జెక్టుగా కలిగి లేదా పీజీ (ఇంగ్లీష్)లో 50 శాతం కనీస మార్కుల ఉత్తీర్ణతతో బీఈడీలో ఇంగ్లీష్ మెథడాలజీ కలిగి ఉండి అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. దరఖాస్తులను జూన్ 26 నుంచి 1 జులై 2023 వరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులకు 3 జులై 2023న ఇంటర్వ్యూ డెమో నిర్వహిస్తామని, 2023-24 విద్యా సంవత్సరానికి మాత్రమే నియామకం జరుగుతుందని, నెలకు రూ.22,750 వేతనం ఉంటుందని తెలిపారు.

మోడల్ కళాశాలలో అడ్మిషన్స్

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు ఆఫ్‌లైన్ ద్వారా తీసుకుంటున్నట్టు ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉన్నట్లు వివరించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

చేతికందని పెట్టుబడి సాయం

- అకౌంట్లను హోల్డ్‌లో పెడ్తున్న బ్యాంక్ అధికారులు
- దిక్కుతోచని పరిస్థితిలో రైతులు
- ప్రశ్నించిన వారికి బెదిరింపులు

నవతెలంగాణ-కోటపల్లి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పెట్టుబడి సాయం కింద సోమవారం రైతుబంధు డబ్బులు ఎకరాకు రూ.5000 చొప్పున విడుదల చేసింది. దీనిని అదునుగా చూసుకొని బ్యాంకర్లు బ్యాంకులో రుణాలు తీసుకున్న వారి అకౌంట్లో డబ్బులు పడితే అకౌంట్ హోల్డ్‌లో పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మండలంలోని సిర్సా గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రైతుల అకౌంటులను హోల్డ్‌లో పెట్టి బ్యాంకు చుట్టూ తిప్పుకున్నట్టు తెలిసింది. గ్రామాలలోని రైతులు బ్యాంకులో లోన్ తీసుకొని అనివార్య కారణాలవల్ల కట్టకపోయినా వారి కుటుంబ సభ్యుల అకౌంటులను హోల్డ్‌లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అలాగే మహిళా సంఘంలో నుంచి లోన్ తీసుకొని ఎవరైనా కట్టకపోతే సంఘంలోని సభ్యుల అకౌంట్‌లు, సంఘంలోని సభ్యుల కుటుంబ అకౌంటులను హోల్డ్‌లో పెట్టారు. సిర్సా గ్రామంలోని అకౌంట్ ఉన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పెట్టుబడి సాయం అందక పంటలు వేసుకునే పరిస్తితి లేదని వాపోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎకరాకి రూ.5000 చొప్పున పెట్టుబడి సహాయం కింద విడుదల చేసిన రైతుబంధు డబ్బులను తీసుకోకుండా బ్యాంక్ అధికారులు అడ్డుపడుతున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతుల పెట్టుబడి సహాయంను ఏ బ్యాంకులోనైనా రైతులు ఎన్ని అప్పులు ఉన్నా ఆపకుండా ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ బ్యాంక్ అధికారులు బేఖాతరు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

కనికరించని బ్యాంక్ అధికారులు

బ్యాంక్ అధికారులను రైతులు సంప్రదిస్తే ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి డబ్బులను అలానే కట్ చేస్తాం దిక్కున చోట చెప్పుకోండి అని రైతులను బెదిరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు పెట్టుబడి సహాయం కోసం ప్రభుత్వం అందించిన డబ్బును రైతులకు అందేటట్లు తగు చర్యలు తీసుకోవాలని రైతులకు కోరుతున్నారు.

రూ.20 వేలు ఆపేశారు

కుమ్మరి ఓదేలు, ఆలుగామ

నా అకౌంట్ లో రూ.20 వేల ఉన్నాయి. నా భార్య మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉంది. నా భార్య గ్రూపు వాళ్ళు తీసుకున్న లోన్‌లో ఒక వ్యక్తి డబ్బులు కట్టకపోతే నా భార్య అకౌంట్‌తో పాటు నా అకౌంట్‌ను కూడా హోల్డ్‌లో పెట్టారు. ఇదేంటని బ్యాంక్ మేనేజర్‌ని అడిగితే అలానే హోల్డ్‌లో పెడతాము నీకు దిక్కున చోట చెప్పుకోమని బెదిరించాడు. అంతేకాకుండా నాకు గత సీజన్‌లో రైతుబంధు డబ్బులు పడ్డా కూడా నా అకౌంట్‌ని హోల్డ్‌లో పెట్టి డబ్బులు రాకుండా చేశాడు.



చినుకు పడితే చిత్తడే..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా అభివృద్ధిలో పరుగులు పెడుతున్నామని జోరుగా ప్రచారం చేసుకుంటున్న ప్రజా ప్రతినిధుల మాటలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలో పరిస్తితి ఉంది. వర్షాకాలం వచ్చిందంటే రోడ్లన్ని చిత్తడిగా మారుతున్నాయి. 2016లో జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత అనంతరం మున్సిపాలిటీగా ప్రకటించినప్పటికీ మలులోకి రాలేదు. దీనితో అటు గ్రామపంచాయతీకాక ఇటు మునిసిపాలిటీ కాక అధికారుల పరిపాలనలో కొనసాగుతోంది. దీనితో జిల్లా కేంద్రంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు సాగుతోంది. వర్షాకాలం వచ్చిందంటే జిల్లా కేంద్రంలోని పలు కాలనీలతో పాటు రహదారులపై నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కార్యాలయ పనులతో పాటు అభివద్ధి పనులు చూడలేక సతమతమవుతున్నారు.

జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఇబ్బందులు

జిల్లా కేంద్రాల్లోని పైకాజినగర్‌లోని గీతం స్కూల్ లైన్‌లో చిన్నపాటి వర్షానికి నీరు నిలుస్తోంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుండి గుండి గ్రామానికి వెళ్లే రహదారితో పాటు, జూబ్లీ మార్కెట్ ప్రాంతంలో, టిఆర్ నగర్‌లో, సందీప్ నగర్‌లోని చివరి ప్రాంతాల్లో, జనకాపూర్‌లోని జైలు వెనుక ప్రాంతాల్లోని కాలనీలు వరద నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా పట్టించుకోని సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి నీరు నిలువ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బురదతో విద్యార్థుల ఇబ్బందులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వద్ద నెలకొన్న బురదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ముందు నుండి నేషనల్ హైవే కావడం రోడ్డు ఎత్తు కావడం పాఠశాల రహదారి కిందికి ఉండడంతో నీరు నిలిచి బురద మయంగా మారింది. నేషనల్ హైవే అధికారులు పాఠశాల గేటు వరకు రహదారి వేయాల్సి ఉన్నప్పటికీ వదిలివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాఠశాలలో మొత్తం ఎనిమిది వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరు ప్రతిరోజు రోడ్డు నుండి పాఠశాల లోపలికి వెళ్లడానికి పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. నేషనల్ హైవే అధికారులు స్పందించి విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల ఎదుట తరచూ ప్రమాదాలు

పాఠశాల ముందు జీబ్రా క్రాసింగ్, స్కూల్ జోన్ లాంటివి ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ వాటిపై నేషనల్ హైవే అధికారులు దృష్టి సారించలేదు. ఇదే విషయం పాఠశాల ప్రిన్సిపాల్ పలుసార్లు వారి దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీనితో గత 20 రోజుల్లో పాఠశాల ముందు మూడు ప్రమాదాలు జరిగాయి. ఇలాగే ఉంటే భవిష్యత్తులో విద్యార్థుల పరిస్థితి పై పాఠశాల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఒకే రాత్రి.. ఐదు దుకాణాల్లో దొంగల హల్‌చల్

- ఒక దుకాణంలో రూ. 5 వేల చోరీ
- నాలుగు దుకాణాలలో చోరీకి యత్నం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఒకే రాత్రి దొంగలు ఐదు దుకాణాలలో హల్‌చల్ సృష్టించారు. అది ఏదో మారుమూల కాలనీలో అనుకుంటే పొరపడ్డట్లే. పట్టణంలోని ప్రధాన కూడలి అయిన రాజీవ్ చౌక్‌కు అతి సమీపంలో. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు దొంగలు కాగజ్‌నగర్‌లో ఎంత రెచ్చిపోతున్నారో తెలియచెప్పేందుకు. సోమవారం ఉదయం వ్యాపారులు తమ దుకాణాలు తెరిచేందుకు రావడంతో అప్పటికే తాళాలు పగులకొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. చోరీకి యత్నించిన దుకాణాలన్నీ కూడా వరుసగా ఉన్నాయి. బాధితులు తెలిపిన ప్రకారం స్థానిక రాజీవ్‌చౌక్ సమీపంలోని సాయి బుక్‌స్టాల్ షట్టర్‌ను దొంగలు తెరిచేందుకు ప్రయత్నించారు. ఒక వైపు తాళాన్ని పగులకొట్టిన దొంగలు రెండో వైపు తాళాన్ని తీసేందుకు ప్రయత్నించారు. అది సాధ్యం కాలేదు. దీనికి సమీపంలోనే ఉన్న ఇండియన్ ఏటీఎం లోనికి వెళ్లిన దొంగలు ఆ యంత్రం వెనుకభాగం నుండి డబ్బులు తీసే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. పక్కనే ఉన్న అమ్జద్ పండ్ల వ్యాపారి దుకాణం తాళం పగులకొట్టి లోనికి వెళ్లగా అందులో డబ్బులు లేకపోవడంతో చోరీ జరగలేదు. పక్కనే ఉన్న మహాలక్ష్మి హోటల్ తాళం పగులకొట్టి లోనికి వెళ్లిన దొంగలు డబ్బుల కోసం వస్తువులన్నీ చిందరవందర చేశారు. డబ్బులు లేకపోవడంతో చోరీ జరగలేదు. హోటల్ పక్కనే ఉన్న రాయల్ వాచ్ రిపేరింగ్ సెంటర్ తాళం పగుల కొట్టి లోనికి వెళ్లి కౌంటర్‌లో ఉన్న రూ.5 వేలను దొంగిలించారు. ఒకే రాత్రి వరుసగా ఉన్న ఐదు దుకాణాలలో దొంగలు చోరీకి యత్నించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. సీసీ టీవీల పుటేజీలను సేకరించే యత్నంలో ఉన్నారు.

వరుస దొంగతనాల పట్ల భయాందోళనలు

కాగజ్‌నగర్‌లో వరుస దొంగతనాల పట్ల పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇంటికి తాళం వేసి ఉందంటే చాలు ఆ ఇంట్లో ఎపుడు ఏమీ జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. గడిచిన 15 రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు జరగగా, ఎనిమిది మంది బాధితులు ఉన్నారు. ఈ నెల 12న రాత్రి ఈద్గా కాలనీలో ఒక రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో దొంగలుచొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ నెల 20న ఎస్పీఎం ఓఆర్‌టి-341, 348 నెంబర్ కార్టర్‌లలో దొంగలు చొరబడి 40 తులాల వెండి ఆభరణాలు, రూ.84 వేల నగదు చోరీ చేశారు. దీనికి ముందు రెండు క్వార్టర్లలో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానిక టీచర్స్ కాలనీలో ఒక ఇంట్లో దొంగలు చోరీ చేశారు. దీనికి పోలీసుల వైఫల్యం ఒక కారణమైతే మరోవైపు ఇంటి యాజమానుల నిర్లక్ష్యం కూడా మరో కారణమవుతోంది. యాజమానులు ఊరికి వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నా ఆ జాగ్రత్తలు పాటించడం లేదు. రాత్రి పోలీసులు నిర్వహించే పెట్రోలింగ్ పట్ల కూడా అనుమానాలు ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన కూడలిలో ఐదు దుకాణాలలో దొంగలు చోరీకి యత్నించడం పోలీసుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది. వరుస దుకాణాలలో చోరీకి యత్నించడాన్ని బట్టి చూస్తే సుమారు గంట పైనే దొంగలు ఆ ప్రాంతంలో సంచరించి ఉండాలి. అంత సమయంలో కూడా పోలీసులు ప్రధాన కూడలి వైపు గస్తీ రాకపోవడం గమనార్హం.



జర్నలిస్టు తులసీచందుకు రక్షణ కల్పించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్



నవతెలంగాణ-హాజీపూర్

జర్నలిస్ట్ తులసీ చంద్‌కు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ స్వతంత్ర జర్నలిస్ట్, సామజిక విశ్లేషకూరాలు తులసి చందును చంపేస్తామని ఫోన్లు చేసి బెదిరిస్తున్న ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తికరణ హక్కును కలరాయడమే అన్నారు. మతోన్మాదం, మనువాద ఆగడాలు, అరాచకలు ప్రశ్నిస్తే దేశంలో శాంతి, మత సమరస్యలను పెంపొందించాలనే ధృఢ సంకల్పంతో సామాజిక మధ్యమాలలో విశ్లేషణలు చేస్తున్న తులసి చందుపై బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికమని, అటవీక చర్య అని పేర్కొన్నారు. గతంలో బీజేపీ మతోన్మాదుల ఆగడాలను ప్రశ్నించినందుకు గౌరీ లంకేశ్, కల్బుర్గి, ఫన్సరేలను హతమార్చిన ఈ మతోన్మాద గుండాలు ఇప్పుడు తులసి చందును హత్య చేస్తామంటూ బెదిరించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తులసి చందుకు రక్షణ కల్పించాలనారు. తులసి చందుకు ఎం జరిగిన దానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు శ్రీలత, సరోజ, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థులకు లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం' పురస్కరించుకొని నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థినుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. దీనితోపాటు ఏ అవసరం పడ్డ ఉచిత న్యాయ సేవలు లభించేలా కోర్టులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చట్టాలను ఉపయోగించుకోవడంతో పాటు విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అన్యాయంపై పోరాటం చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ఎటువంటి ఫిర్యాదు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాల కోర్చి చదివిపిస్తారని వారి కష్టాలను గుర్తించి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పూదరి మనోహర్, లీగల్ అసిస్టెంట్ అంజనీదేవి, హరీష్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

షూటింగ్ ఛాంపియన్స్‌గా నిలిచిన మహిళ పోలీస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ స్టేట్ తొమ్మిదవ షూటింగ్ చాంపియన్ షిప్ 2023-24లో జిల్లాలోని కౌటాల పోలీస్‌స్టేషన్‌లో నిధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కానిస్టేబుల్ బి.స్రవంతి 10ఎం ఎయిర్ పిస్టల్ విభాగంలో రజిత పథకం సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధానిలోని తన కార్యాలయంలో పతక విజేతలను డీజీపీ అంజని కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షూటింగ్ చాంపియన్ షిప్‌లో వివిధ విభాగాల్లో 8 మంది పోలీస్ అధికారులు విజేతలుగా నిలవడం పోలీస్ శాఖకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. విజేతలను అభినందించిన వారిలో హైదరాబాద్ పోలీస్ శాఖ అధికారులు ఉన్నారు. జిల్లాకు చెందిన మహిళ కానిస్టేబుల్ రజిత పథకం సాధించడం సంతోషంగా ఉందని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ ఆమెకు అభినందనలు తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణ బాధ్యత ప్రభుత్వానిదే

నవతెలంగాణ-రామకష్టాపూర్

మదకద్రవ్యాల నియంత్రించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని తెలంగాణ బలహీనవర్గాల అధ్యక్షులు న్యాయవాది, రాజలింగు మోతె అన్నారు. సోమవారం అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక రామాలయం చౌరస్తా అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1985 నార్కోటిక్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాలు వాడటం, కలిగి ఉండటం, సరఫరా, ఉత్పత్తి చట్టరీత్యా నేరమని తెలిపారు. నేటికీ మన దేశంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దొరుకుతూనే ఉన్నాయని, వాటి వాడకం పెరుగుతూనే ఉందని అన్నారు. 9,10 సంవత్సరాల వయస్సు గల పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలతో పాటు యువత డ్రగ్స్‌ను సేవించి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, తాత్కాలిక ఉపశమనం కోసం డ్రగ్స్ వాడడం వలన వారి భవిష్యత్తు అంధకారమవుతుందని అన్నారు. దీనిని అరికట్టేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలతో దేశ ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితిలపై ప్రభావం పడుతుందని, ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గోండు గ్రామస్తులకు పట్టాలివ్వాలి

నవతెలంగాణ-నస్పూర్



జన్నారం మండలం గుండుగూడ గ్రామస్తులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసు అన్నారు. సోమవారం ట్రైనీ కలెక్టర్ గౌతమికి గ్రామస్తులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గోండుగూడ గ్రామస్తులు 1982లో ఆనాటి ప్రభుత్వం 35 కుటుంబాలకు 2-20 ఎకరాలలో నివాస స్థలాలు అధికారికంగా కేటాయించిందని తెలిపారు. ఆనాటి నుండి ఇప్పటి వరకు ఆ కుటుంబాలు అక్కడే నివాసం ఉంటున్నాయి కానీ వారికి ఇండ్ల పట్టాలు లేవని తెలిపారు. వెంటనే ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలం సిపిఐ నాయకులు అబ్దుల్లా, తొడసం జంగు పటేల్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



వయోధికుల వేధింపుల అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలని, డే కేర్ సెంటర్‌లు, వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని, వేధింపులను నివారించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం పిలుపు మాసపత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు జి పూర్ణచందర్‌రావు, సభ్యులు మురళీధర్‌రావు, శివప్రసాద్, సుభాష్, బి నర్సయ్య, సునీల్, పురుషోత్తం, మహబూబ్, రామయ్య, రామరాజు, రాజయ్య, షణ్ముఖచారి, కె నర్సయ్య పాల్గొన్నారు.

మరవద్దు మహనీయుల త్యాగాలు

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్



నవతెలంగాణ-జైనథ్

మహనీయుల త్యాగాలను మరువద్దని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గడుగు మహేందర్ అన్నారు. మండల కేంద్రంలో రిజర్వేషన్ల పితామహుడు చత్రపతి సాహు మహారాజ్ 149వ జయంతి సందర్భంగా సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సామాజికన్యాయం అమలుకు 28 ఏళ్ల వయస్సులోనే తన రాజ్యంలో బ్రాహ్మణేతరులకు 50శాతం రిజర్వేషన్లు కల్పించి, సమాన అవకాశాలకు పునాదులు వేసిన మహనీయులు ఛత్రపతి సాహుమహరాజ్ అని తెలిపారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించి విద్యాసంస్కరణల కమిటీ ఏర్పాటు చేసి 1917లోనే ఉచిత నిర్బంధ విద్య అమలు చేశారని తెలిపారు. అంతేకాకుండా తన రాజ్యంలో కులాంతర మతాంతర వివాహాల చట్టం తీసుకువచ్చి ప్రజాస్వామ్య విలువలకు పునాదులు వేశారని, హిందూ పిల్లల జోగిని వ్యవస్థను నిరోధించే చట్టం తెచ్చి, వివక్ష అంటరానితనం నిషేధించి కొల్హాపూర్ సంస్థానాన్ని ఎన్నో మిగతా రాజ్యాలకంటే అధునాతన, ఆధునిక భావాలతో అభివృద్ధి పథంలో నడిపారని పేర్కొన్నారు. అంటరానికులాలకు చెందిన ప్రజలకు చదువు రాకపోయినా, సైన్యంలో చేరే అవకాశాలను కల్పించి సమానత్వాన్ని చాటి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు మ్యాన సురేష్, మండల కన్వీనర్ రావుల పొచ్చన్న, సురేష్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి



నవతెలంగాణ-తాంసి

మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలోని కరంజి, గోముత్రి, కరన్వాడి, అంతర్గావ్ గ్రామాలలో మండల నాయకులతో కలిసి మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ 9సంవత్సారాల పాలనను వివరిస్తూ బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో భారత్ ఆర్థిక వ్యవస్థ 10వ స్థానం నుండి 5వ స్థానానికి చేరుకుందన్నారు. కొద్ది రోజుల్లో భారత్ ప్రపంచంలో మొదటి స్థానానికి చేరుకుంటుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు 3కోట్ల ఇండ్లు కట్టించారన్నారు. రాష్ట్రానికి 2.5లక్షల ఇండ్లు కేటాయిస్తే, కేసీఆర్ ప్రజలకు కట్టివ్వకుండా ఆ నిధులను ఇతర వాటికి ఖర్చు చేశారన్నారు. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తుందని, టాయిలెట్లు, రోడ్లు, డంపింగ్ యార్డులు, ఇంకుడు గుంతలు, శ్మశానవాటికలు స్వరాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి నిధులన్ని కేంద్రమే ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో భీంపూర్ మండల అధ్యక్షులు జజ్జరి రాకేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుర్ల నారాయణ, ఎంపీటీసీ రెడ్డివార్ రమేష్, మండల నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సుర్పం అరుణ్, మండల రాథోడ్ నవీన్, గజానన్ సంజీవ్, సర్పే కిషోర్, మెస్రం సోమేశ్వర్, రాథోడ్ సంతోష్, విఠల్ ఉన్నారు.

మేదరి సంఘం రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసికి చోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర మేదరి సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం సిద్దిపేట జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేదరుల సమస్యలన్నింటి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యవర్గంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పిల్లి కిషన్ మేదరి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సంఘానికి విశిష్ట సేవలు అందించినందుకు ఈ పదవి వరించిందని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గంలో ప్రతిష్టాత్మక పదవిని అలంకరించిన పిల్లి కిషన్‌ను మేదరి సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఊరే దినేష్, ఊరే గణేష్ సంఘం సభ్యులు అభినందిచారు.

పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-నస్పూర్

పశుమిత్రులకు కనీస వేతనం చెల్లించాలని, అలాగే ఐడి కార్డులు యూనిఫామ్‌లు పశు సంవర్ధక శాఖ నుండి ఇవ్వాలని పశు మిత్ర వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు దుంపల రంజిత్ కుమార్ అన్నారు. తెలంగాణ పశు మిత్ర వర్కర్స్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8సంవత్సరాలుగా పశుమిత్ర వర్కర్స్‌గా పని చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలకు సోకే వ్యాధులకు వైద్యం అందిస్తున్న పశుమిత్రలను ప్రభుత్వం వెంటనే కార్మికులుగా గుర్తించి, గుర్తింపు కార్డులు, యూనిఫామ్, మెడికల్ కిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మధ్యలో ఆపేసిన ఏఐ ట్రైనింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని, పశువులకు సరిపడా వ్యాక్సిన్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు శ్రీలత మాట్లాడుతూ పశువులకు వైద్యం అందించడానికి ఐకేపీ సెంటర్ల నుండి ట్రైనింగ్ ఇచ్చారు కానీ ఎలాంటి వేతనం నిర్ణయం చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు జీతాలు పెంచిన ప్రభుత్వం తమకు జీతాలు ఇవ్వడానికే డబ్బులు లేవా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి, జిల్లా కోశాధికారి రాజేశ్వరి, జ్యోతి, సరిత, శ్రీలత, సరోజ, మాధవి, లక్ష్మి, మల్లిక, రాజేశ్వరి, నీరజ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ప్రగతి దినోత్సవ వేడుకలు

- యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ సెంటర్ ప్రారంభం
- విద్యార్థుల సంక్షేమం, మెరుగైన విద్య అందించేందుకు కృషి : వీసీ వెంకటరమణ



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో విద్యార్థుల సంక్షేమం మెరుగైన విద్యాభ్యాసం అందించేందుకు కృషి చేస్తున్నామని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ అన్నారు. సోమవారం యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో 500 కంప్యూటర్లతో సైన్స్ సెంటర్‌ను కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రీడింగ్ రూమ్, ఐపిఆర్ సెల్‌ను నూతనంగా ప్రారంభించి, పేరెంట్స్ లాంచ్, సైన్స్ బ్లాక్, ఎగ్జామినేషన్ బ్లాక్ భూమి పూజను వీసీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి చేశారు. అనంతరం సాక్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విసి వెంకటరమణ మాట్లాడుతూ ఆర్జీయూకేటి యూనివర్సిటీ ప్రగతి పథంలో నడిపించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని, విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ సహాయ సహకారాలతో ఉన్నత విద్య సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. యూనివర్సిటీ పురోగతి సాధించాలంటే విద్యార్థులతోపాటు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది సేవలు కూడా ఎంతో ముఖ్యమని అందుకు అనుగుణంగా వారి సేవలను గుర్తిస్తూ ఉత్తమ సేవకులుగా అవార్డులను ఈ సంవత్సరం నుండి అందిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తోందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ యూనివర్సిటీ నెలకొల్పబడిందని తెలిపారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసంపై దృష్టి పెట్టి తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పురోగతి దినోత్సవంలో పాల్గొనడం చాలా ఆనందదాయకమని, విశ్వవిద్యాలయానికి జిల్లా అధికారులు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యంపై గురి పెట్టాలని, తల్లిదండ్రుల కలలను సహకారం చేసేందుకు నిరంతర కృషి చేయాలని, సాంకేతికంగా వస్తున్న మార్పులను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. అంతకుముందు స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోస్టర్ ప్రజెంటేషన్ విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సతీష్ కుమార్, ఎఎస్‌పి శ్రీకాంతిలాల్ పాటిల్, వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



స్వచ్ఛభారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఆర్కే-7 గనిలో నిర్వహించిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాల్లో ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా జూన్ 16 నుండి 30 వరకు స్వచ్ఛతా పక్వాడ్‌పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాతిపిత మహాత్మ గాంధీ కలలుగన్న స్వచ్ఛ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రతి ఒక్కరు పరిశుభ్రతకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. సంవత్సరానికి 100 గంటలు అంటే వారానికి 2గంటలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆర్కే-7 గని ఉద్యోగులు ప్లాస్టిక్ నిషేధంపై ప్రదర్శించిన నృత్యాన్ని జనరల్ మేనేజర్ తిలకించి కళాకారులను అభినందించారు. సంస్థలో కళాకారులకు ప్రోత్సాహం కలిగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఉద్యోగులకు అవగాహన కలిగిస్తూ స్వచ్ఛందంగా గని అధికారులు ఉద్యోగులకు ప్లాస్టిక్ రహిత చేతి సంచులను పంపిణీ చేశారు. అనంతరం మంచిర్యాల మార్కెట్ పరిసర ప్రాంతాలలో వ్యాపారస్తులకు, వినియోదారులకు ప్లాస్టిక్ వినియోగంపై కలిగే నష్టాన్ని వివరించారు. అనంతరం వినియోదారులకు ప్లాస్టిక్ రహిత చేతి సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణ అధికారి రవి శంకర్, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రెటరీ మేండే వెంకటి, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకటరామ్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్లు సుధీర్‌రెడ్డి, తోట రమేష్, ఎన్విరాన్మెంట్ అధికారి జగదీశ్వర్‌రావు, సంక్షేమ అధికారి సంతన్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం కార్యాలయంలో సంబంధిత కరపత్రాలు విడుదల చేశారు. మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల శాఖ, సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డిసెంబర్ 7,1987న ఐక్యరాజ్యసమితి 93వ ప్లీనరీ సమావేశం జరిగిందన్నారు. తర్వాత డిసెంబర్ 13, 1985న చేసిన 40/122 తీర్మానాన్ని గుర్తు చేస్తూ, మాదకద్రవ్యాల పట్ల అవగాహన సమాజానికి తీసుకువచ్చే ప్రధాన సమస్యపై ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని 'మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం'గా 36 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 2023వ సంవత్సరం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం వివక్షను ఆపండి, నివారణను బలోపేతం చేయండి'పై పలువురు అధికారులు తమ సందేశాన్ని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లోకేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో సోమవారం అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లోకేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

పిడుగుపాటుతో మృతి చెందిన భూపాలపట్నం గ్రామానికి చెందిన టాక్రె బిక్కు కుటుంబ సభ్యులను బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అధైర్య పడొద్దని బాధిత కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిడుగుపడి మృతి చెందిన బిక్కుకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలందరు చిన్నవారు కావడంతో ఆయన కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కును కోల్పోవడం బాధాకరమన్నారు. అందరు చిన్న పిల్లలు కావడంతో తన కుటుంబాన్ని పోషించుకోవడానికి తన భూమి సరిపోదని, వేరే వారి భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకొని తన కుటుంబాని పోషించుకునేవాడని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వెహికల్ ట్రాకింగ్ సిస్టంపై డైరెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-నస్పూర్

వెహికల్ ట్రాకింగ్ సిస్టంపై డైరెక్టర్ ఫైనాన్స్, పా బలరాం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో వెహికల్ ట్రాకింగ్ సిస్టం పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. బొగ్గు రవాణాలో వెహికల్ ట్రాకింగ్ సిస్టం ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా చత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఛత్రపతి శివాజీ వారసుడు ఛత్రపతి సాహు మహారాజ్ 149వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని ఛత్రపతి భవన్‌లో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ గొప్పతనాన్ని కొనియాడారు. ఆయన వారసుడుగా సాహు మహారాజ్ ఎన్నో గొప్ప పనులు చేశారని కీర్తించారు. ఆరె కులస్తుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం, ఉపాధ్యక్షుడు కోలే బిక్కాజీ, అసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు బోర్కుటే తిరుపతి, ఉపాధ్యక్షుడు బోటుపెల్లి అన్నారావు, ప్రధాన కార్యదర్శి నాగపూరి మారుతి, ఆత్మ చైర్మన్ కురత్కర్ రమేష్, కోశాధికారి అసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడెన్కార్ సంతోష్ పాల్గొన్నారు.

యాజమాన్యం ఇచ్చిన సర్కులర్ రద్దు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

కార్మికులు గనులపై జరుపుకునే విందులను రద్దు చేయాలని ఇటీవలే యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ వెంటనే రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, కే వీరభద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలా కాలం నుండి గనులపై కార్మికులు విధులు నిర్వహించుకున్న తర్వాత గనులలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, గనులపై కార్మికులు మైసమ్మను చేసుకుని విందులు చేసుకుంటూ ఉంటారని తెలిపారు. అదేవిధంగా కార్మికులు రిటైర్డ్ అయితే గనులపై విందులు ఏర్పాటు చేసుకుంటారని, కార్మికులు ఒకే కుటుంబంగా భావించి విందులు చేసుకున్నప్పుడు అధికారులను కూడా ఆహ్వానించడం జరుగుతుందన్నారు. అలా విందులు చేసుకోవడం గనులపై ఆనవాయితీగా వస్తుందని, ఈనాడు యాజమాన్యం అలాంటి విందులు ఏర్పాటు చేసుకోరాదని కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని, దీన్ని యాజమాన్యం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పఠనోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఈవో

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులలో పఠనాసక్తిని పెంచేందుకు రీడింగ్ రూమ్‌లో ఎంతోగానో దోహదపడతాయని విద్యాశాఖాధికారి ప్రణీత అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్న పాఠశాలలో ఏర్పాటు చేసిన పఠనోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైబ్రరీని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ప్రతి విద్యార్థి చదివేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కంటే నరసయ్య, సుజాత్‌ఖాన్, జె నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

27న బస్ డిపోలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-నిర్మల్

ఈ నెల 27న నిర్మల్ ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సాయన్న సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలిపారు. రక్తదాతలు 27న ఉదయం 9 గంటలకు రావాలని కోరారు.